ఆదివారం

ప్రజాశక్తి

ఆగస్టు 29, 2004

కథా నిలయం



తెలుగువేణి కృష్ణవేణి

హ్యాపీ బర్త్‌డే

(29-8-2004 నుంచి
4-9-2004 వరకు)

అరిగెల లెనిన్
2సం॥, 29.8.2002
శోభ-రాజారామ్
నెల్లూరు

శశిబాబు
3సం॥, 29.8.2001
హైమామాధవి-దివాకర్
వీరవల్లి-కృష్ణా

కె. వినోద్
4సం॥, 29.8.2000
లక్ష్మి-సేవ్యానాయక్
అల్లీకోల్ తండా-రంగారెడ్డి

భావన
3సం॥, 29.8.2001
లక్ష్మీదేవి- లక్ష్మీరంగయ్య
ఆలూరు-అనంతపురం

కె. తరుణ్
2సం॥, 29.8.2002
కవిత-శ్రీశైలం
గంగాపురం-నల్లగొండ

వి. హిందువాణి
3సం॥, 29.8.2001
వరలక్ష్మి-వీరేష్
హోళగుంద-కర్నూలు

జితశ్రీ
3సం॥, 30.8.2001
వెంకటలక్ష్మి-శంకర్
అంకమ్మనగర్-గుంటూరు

రాయల హిమబిందు
7సం॥, 29.8.1997
వసంత-వెంకటేశ్వరరావు
అశ్వాపురం-ఖమ్మం

వెంకటనాగ అనుదీప్
ఆగస్టు-29
చంద్రకళావతి-శ్రీనివాసరావు
నరసరావుపేట-గుంటూరు

ఉష
1సం॥, 30.8.2003
రాజేశ్వరి-నాగన్న
దిబ్బసానిపల్లి-అనంతపురం

స్వర్ణ ప్రణతి
ఆగస్టు-30
ప్రశాంతి సుధ-మార్కండేయులు
విజయవాడ-కృష్ణా

ఫణీంద్రవంశీ కృష్ణ
ఆగస్టు-30
సూర్యకుమారి-వేణుగోపాలరావు
కిడ్స్ ప్రైడ్ స్కూల్-కాకినాడ

యన్.ప్రశంస
3సం॥, 30.8.2001
జ్యోతి-సురేష్
సూర్యాపేట-నల్లగొండ

రమ్యశ్రీ
ఆగస్టు-31
రేవతి-దీనదయాళ్
యాదవవీధి-తిరుపతి

కె. సాహితి
1సం॥, 1.9.2003
శివకుమారి-వెంకటేశ్వరరావు
విజయవాడ-కృష్ణా

అనుదీప్ సత్యసాయి
5సం॥, 2.9.1999
నాగలక్ష్మి-అప్పారావు
క్రొత్తగైగోలు పాడు-కాకినాడ

29-8-2004.

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం





కవర స్టోరీ ఆసక్తిదాయకం

మా అభిమాన దినపత్రిక 'ప్రజాశక్తి' ఆగష్టు 8,ఆదివారం సంచికలోని కవర్‌స్టోరీ– "హాస్యానికి 'పుట్టిల్లు' అల్లు" ఆద్యంతం ఆసక్తితో చదివింపజేసింది. హాస్యానికి మారుపేరైనప్పటికీ విలనిజానికి, క్యారెక్టర్ ఆర్టిస్టుకు కూడా మారుపేరైన అల్లు రామలింగయ్య గారికి నివాళిగా అందించిన వ్యాసం విశ్లేషణాత్మకంగా ఉంది. గ్రూప్ ఫొటో, ఫొటోలు కూడా చాలా బాగున్నాయి.

ఎం.డి. ముస్తఖీమ్,

మనలో మాట

ఈ వారం 'మనలో మాట' రచన నన్ను చాలా ఆకట్టుకొంది. నేను 1945 నుండి 1949 వరకు బందరు హిందూ కళాశాలలో ఇంటర్, బి.ఎ. చదివాను. ఒక్కసారిగా నన్ను 60సంవత్సరాలు వెనెక్కి తీసుకెళ్ళి కోనేరుసెంటరు చూపడం నాకెంతో ఆనందంగా వుంది. తోట నరసయ్యగారిని స్వయంగా ఎరుగుదును. పైపెచ్చు నా పేరు సుబ్బారావు. ఆ పేరుతో బావబావమరుదుల పేరడీ భలేగా ఉంది. ధన్యవాదాలు.

ఎ సుబ్బారావు, బ్రాడీపేట, గుంటూరు

హాస్యానికి మారుపేరు

హాస్యానికి మారుపేరుగా, హాస్యమే తన ఊపిరిగా చేసుకుని హాస్యనట చక్రవర్తి అల్లు రామలింగయ్య. పద్మశ్రీ, రఘుపతి వెంకయ్య అవార్డుల గ్రహీత అయిన అల్లు రామలింగయ్య వెండితెరపై నవ్వులపువ్వులు పండించారు. మనందరినీ కన్నీటిసాగరంలో ముంచి తను దివికేగటం నిజంగా ఊహించని విషాదం.

మేడూరి సత్యనారాయణ,
తిరుపూరు, కృష్ణాజిల్లా

అల్లు రామలింగయ్య గారి (మామయ్య) గురించి మీరిలా ప్రతిస్పందన ఇవ్వడం... ప్రజాశక్తి నివాళులర్పించడం పట్ల..... ప్రజాశక్తికి నా సంతోషాన్ని తెలియ జేస్తున్నాను.



హాస్య ధృవతార

"హాస్యానికి పుట్టిల్లు అల్లు" జీవితచరిత్ర చాలా చక్కగా వివరించారు. అలాంటి మహానటుడ్ని పోగొట్టుకున్నం ముకు మన ఆంధ్రుల హాస్యధృవతార రాలిపోయినందుకు మనందరం ఎంతో బాధపడవలసిన ఆవశ్యకత ఎంతైనాఉంది. రచయిత హెచ్ రమేష్‌బాబుగారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు. "ఓటి బతుకులు" కథ చాలా బాగుంది. రచయిత శిరంశెట్టి కాంతారావుగారికి అభినంద నలు. టూరిస్ట్‌గైడ్‌లో "అరేబియా సముద్ర తీరం–కొచ్చిన్" గురించి చాలా విపులంగా ప్రచురించారు. చదువుతున్నంతసేపూ అక్కడకు వెళ్ళినట్లే అనుభూతి కల్గించినట్లు ప్రచురించిన ఎడిటర్‌గార్కి, రచయిత ప్రభాత్‌గారికి హాట్సాఫ్.

విప్పాడఉమామహేశ్వరరావు,
కురుపాం–535524

మనలో మాట

మీడియా సృష్టి

ప్రభువులు–

ఏం మాట్లాడినా వేదవాక్కులల్లె చెల్లుబడి అవుతుంది.

ఇవ్వాళ చెప్పిన మాటని రేపు కాదంటారు!

నేను అట్లా అనలేదు ఇట్లా అన్నానంటారు!

ఇట్లా అన్నది అట్లా చిత్రించడం 'మీడియా సృష్టి' అంటారు!

ఏదేదో మాట్లాడి తలనొప్పి తెచ్చుకునేది సాక్షాత్తు శ్రీవారే! తప్పుడు రాతలు రాసి తలమీదకు తెస్తున్నారని మీడియాను కోప్పడేది కూడా శ్రీవారే!

డ్యూయల్ రోల్!

ద్విపాత్రాభినయం!

సొంతమనుషుల్ని ఉత్సాహపరిచేందుకు అనేకం మాటాడుతుంటారు. వాళ్ళు సెభాషంటారు!

టెక్నికల్ ఇబ్బందులను గాలికి విడిచిపెట్టి కొన్ని వరాలను కురిపిస్తారు! ఆ సభలో హర్షధ్వానాలు మార్మోగిపోతాయి !

అంతవరకు బాగానే వుంటుంది!

అక్కడ జరిగిన ఆనందహేలను పేపరువాళ్ళు తూ.చ. తప్పకుండా ఎంతో శ్రద్ధగా రాసుకుంటారు. ఆ తర్వాత సదరు పేపరు జనం చేతుల్లోకి వెడుతుంది!

శ్రీవారి తొందరపాటు వరాలకు జనం విస్మయం చెందుతారు!

జనం తాలూకు విస్మయం–

శ్రీవారికి ఫీడ్ బేకవుతుంది!

అప్పుడు శ్రీవారికి తన తొందరపాటేమిటో తెలుస్తుంది. నాలుక్కరుచుకుంటారు. ఏం చేయాలో తోచక– తప్పుడు రాతలు రాస్తున్నారంటో పేపరువాళ్ళ మీద విరుచుకుపడతారు!

ఇది చాలాకాలంగా నడుస్తున్న చరిత్ర!

ఆగస్టు 23న ఆదిలాబాద్‌లో జరిగిన తెలంగాణా రాష్ట్ర సమితి జిల్లా కార్యవర్గ సమావేశంలో చిన్న నీటిపారుదల మంత్రివర్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు!

"తెలంగాణ ప్రాంతం వెనుకబాటుతనం పోవాలంటే ముందుగా సాగునీటిరంగం అభివృద్ధి చెందాల్సివుంది. దానికోసం నా పరిధిలో వున్న 600కోట్ల రూపాయలను నయాపైసతో సహా మన వెనకబడిన ప్రాంతానికే వెచ్చిస్తా. ఇందులో మరోమాట లేదు. ఇది బయటపెట్టే మాటకాదు" అంటూ కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ప్రకటించేరు!

ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో?

రెండ్రోజుల తర్వాత ఒకానొక ఇంటర్వ్యూలో–చిన్న నీటి పారుదల శాఖ కింద వుండే నిధులు మొత్తం తెలంగాణాకే కేటాయిస్తామని చెప్పేరుగదా అని మంత్రిగారిని అడిగినప్పుడు వారి సమాధానం ఈ విధంగా వుంది–

"నేను అలా అనలేదు. తెలంగాణాలాగా వెనుకబడిన రాయలసీమతో పాటు ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం వంటి జిల్లాలకు నిధులు ఎక్కువగా ఇవ్వాలని చెప్పాను!"

మీడియా సృష్టి గురించి ఇంకేం చెప్పను?

❖

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3

కార్టూన్ కదంబం... . . . 4

కవర్ స్టోరీ . . . 5

కథ . . . 8

బాలల కథ . . . 11

బాలనేస్తాలు . . . 12

ఇంతిసంగతులు . . . 16

కచేరి . . . 17

పుస్తక పరిచయం . . . 20

కళాసాహితి . . . 22

న్యాయసలహాలు . . . 24

ఇంకా...



సెక్స్‌మయం హింసమయం

జీవనశైలి ... 10

శత్రువుపై యుద్ధం

రియల్‌స్టోరీ ... 14



వైరస్ వల్ల వచ్చే కామెర్ల వ్యాధి

ఆరోగ్యం . . . 18, 19

ఎగిసిపడే జలగీతం ఎత్తిపోతల జలపాతం

టూరిస్ట్‌గైడ్ . . . 21

ఉత్తరాలతో చికెన్‌కర్రీ...

"యాహూ... ఉత్తరాలతో కోడికూర వండుకుంటే...భలే రుచిగా...మజాగా ఉంటది...హిప్‌హిప్ హుర్రే...చికెన్ కర్రే.." అని లొట్టలేస్తున్నాడా బీహారీవాలా. చికెన్ వండుకుతినాలి అనిపించినప్పుడల్లా అరవింద్ యాదవ్ పాట్నా రైల్వే ప్లాట్‌ఫారంమీదకొచ్చేస్తాడు. నాలుగు ఇటుకరాళ్ళను పొయ్యిలా పెట్టి కోడిమాంసం దాకను పొయ్యిమీదపెట్టి ఎక్స్‌ప్రెస్ రైలు ఇంకా రాలేదేవిటబ్బా అని చూస్తుంటాడు. ఎదురుచూస్తున్న రైలు రాగానే రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్ఎంఎస్) భోగీ దగ్గరకెళ్ళి ఉత్తరాల కట్టలు తెచ్చేస్తాడు. ఆ ఉత్తరాలు మంటగా పెట్టి ఆ కూర వండేస్తాడు. ఇలా కొన్ని సంవత్సరాలుగా ఎవరికో చేరాల్సిన ఉత్తరాలను వంటచెరుకుగా మంటబెట్టి ఎంచక్కా కోడికూర వండేసి తిని తేన్చుతున్నాడీ అరవింద్ యాదవ్ మహాశయుడు. గతవారం రెడ్‌హాండెడ్‌గా పట్టుకుని జైల్లో పెట్టినా..."ఉత్తరాల మంటమీదొండిన కోడికూర సారూ...యమాగుంటది" అని అంటూనే ఉంటున్నాట్ట !!

చితాభస్మంతో వజ్రాలు...!

ఆ బ్రిటిష్‌దేశపు సాధ్వీమణి తన భర్తను ఎంతగా ప్రేమించిందో ! "నీవు పోగొట్టుకున్న అతగాని వస్తువులూ నీకు దూరం కావచ్చు...కానీ చెరగని మాయని అతగాని జ్ఞాపకాలు చెరపలేరు వేరెవ్వరూ" అని తన దేశపు కవిత్వాన్ని కూడా సవరించేసిందావిడ. తన ప్రియాతిప్రియమైన భర్త జ్ఞాపకాలనే కాదు ఏకంగా అతని చితాభస్మంతో వజ్రాలు తయారుచేయించుకుని పదిలపరుచుకుంది. లిన్ టాండీ అనే ఆ మహిళ భర్త ఇటీవల మరణించాడు. తన భర్త చితినుండి బూడిదను జాగ్రత్తగా పేక్‌చేసి అమెరికాకు పంపింది. అక్కడ ఆ బూడిదను వజ్రాలుగా చేసేందుకు ప్రాసెస్ చేసి, అధిక ఉష్ణోగ్రతలో వేడిచేసి ఇచ్చారు. సింథటిక్ వజ్రాలు తయారయ్యే కర్బన మూలకాలేవో బూడిదలో ఉంటాయిట! ఆపద్ధతినఓ పీతవర్ణ (కంగారుపడకండి... పసుపురంగు) వైఢూర్యాన్ని తయారుచేయించింది లిన్ టెండీ. తన ఇద్దరు కూతుళ్ళకూ చెరొక ఉంగరం చేయించి, అందులో ఆ వజ్రాల తునకల్ని పొదిగించుతోంది. ఇదేదో బాగుంది సుమీ అని మీరుకూడా ఆత్మీయుల చితాభస్మంతో ఈ విధాన వజ్రవైఢూర్యంబులను చేయబూనేరు... ఆ పద్ధతిన తయారుచేయడానికి లిన్ టెండీ 2,250 పౌండ్లు అనగా లక్షా తొంభైఒక్కవేల రూపాయలు ఖర్చుపెట్టింది. చెప్పాను మరి. ఇక మీఇష్టం...



సైబర్‌సైడ్ రోమియోలు...!

దారినపోయే ఆడపిల్లలను అల్లరి చేసే రోడ్‌సైడ్‌రోమియోలను ఇన్నాళ్ళుగా చూస్తూనేఉన్నాం. నెట్‌వీధులలో సైబర్‌దారిన యి-మెయిళ్ళ వ్యక్తిగతలోగిళ్ళలోకి జొరబడి అంకఛండాలపు పనులుచేసే ఆకతాయిలీ సైబర్‌సైడ్ రోమియోలు. ఏదో ఒక దారిన అమ్మాయిల యి-మెయిల్ అడ్రస్సులు దొరకపుచ్చుకుంటారు. ఆ తరువాత అశ్లీలరాతల నెట్టుత్తరాలు, సెక్స్‌బొమ్మల ఇమేజ్ సెండింగ్‌లతో నానా తలనొప్పులూ కలిగిస్తున్నారు. లేదా ఆమెకు సంబంధించిన ఛాటింగ్‌ల మధ్యలోకి జోక్యమైపోయినట్లుకూడా తెలియకుండా దూరిపోయి, ఆ ఇద్దరిమధ్య లేనిపోని మనస్పర్ధలు కలిగించి శునకానందపడుతుంటారు. ఇటీవల ముంబయిలో ఓ అమ్మాయి తన కంప్యూటర్ ఆన్‌చేసి, తనకిష్టమైన సైట్ ఓపెన్ చేసింది. కానీ తనపేరున తన ఫోల్డర్‌లో ఈ పైన చెప్పినవన్నీ స్క్రీన్‌మీదకొచ్చేస్తున్నాయి. ఏం చెయ్యాలో పాలుపోలేదు. వెంటనే కంప్యూటర్‌ని షట్‌డౌన్‌చేసి పోలీసుల్లోని 'సైబర్ ఫోరెన్సిక్' విభాగానికి రిపోర్టు చేసింది. స్పెషల్‌సెల్ జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కర్నల్ సింగ్ బోధనల్లో సైబర్‌క్రైమ్‌ల ఇన్వెస్టిగేషన్ విధానం, దానికి చెందిన పద్ధతుల్లో శిక్షణపొందిన పోలీసుబాబాయిలు వలవేసి నెట్‌వీధుల్లోని ఈ సైబర్‌సైడ్ రోమియోలను ఓ పట్టు పట్టారు.

కార్టూన్ కదంబం


నిజంగానే మనదిప్పుడు 'చింతా' బైఠక్ నేగా సార్
చింతన్ బైఠక్‌లు చింతా బైఠక్‌గా మారాయి సోనియా


పాపం, సోనియా ప్రధాని కాకుండానే రాజీనామా చేసింది
సీఎం పదవి
సోనియా ప్రధాని అయితే సిఎం పదవికి రాజీనామా చేస్తా: ఉమాభారతి
ఈద్గా కేసులో ఉమాభారతి రాజీనామా
ఉమ
నారు


డోపింగ్‌లో పతకాలు పెడితే అన్నీ మనకే వచ్చేట్టున్నాయి...
డోప్ టెస్టులో దొరికిపోయిన భారత ఆటగాళ్లు



తెలుగువేణి కృష్ణవేణి

నీరు ప్రాణికోటికి జీవాధారం. అటు విజ్ఞానశాస్త్రం, ఇటు ఆధ్యాత్మికప్రపంచం నీటి బహుముఖ ప్రయోజనాలను గుర్తించి గౌరవిస్తున్నాయి. లక్షలాది ఎకరాలభూమిని సస్యశ్యామలం చేస్తూ కోట్లాదిమంది దాహం తీరుస్తూ నిరంతరవాహినిగా సాగిపోయే నదులు ఆ జాతి సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయి. డార్విన్ చెప్పిన జీవ పరిణామ సిద్ధాంతం ప్రకారం నీటి పరిసరాల్లోనే ప్రాణుల ఉనికి ఉందని చెబుతారు. మార్క్సిస్టు పండితుడు, చరిత్రపరిశోధకుడు రాహుల్‌సాంకృత్యాయన్ రాసిన 'ఓల్గా సే గంగా' లో నదీతీరాలెంబడి సాగిన మానవేతిహాసాల్ని గ్రంధస్తం చేశారు. అందుకే నదుల పట్ల మనకు పవిత్ర భావన ఉంది. ఆధ్యాత్మికవాదులు ఆరాధనాభావంతో, భౌతికవాదులు గౌరవభావంతో జలసంపదను పరిగణిస్తారు. మొన్నటి గోదావరి పుష్కరాలు ముగియడం మళ్ళీ కృష్ణవేణికి పుష్కరాలు రావడంతో ఓ కోలాహాలం, సందడి మొదలయ్యాయి.

హెచ్. రమేష్‌బాబు,
యు. రామకృష్ణ

మన రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, తుంగభద్రలు ఒకనాడు జీవనదులుగా భాసిల్లినవి. సెప్టెంబర్ ఎనిమిదవ తేదీ వరకూ జరిగే కృష్ణా పుష్కరాలకు మూడుకోట్లమంది యాత్రికులు వస్తారని ప్రభుత్వం చెపుతోంది. మొత్తం 20 ప్రభుత్వ శాఖలు పుష్కర పనులు చేపట్టాయి. మన రాష్ట్రంలో కృష్ణానది ప్రవహిస్తున్న మహబూబ్‌నగర్, కర్నూలు, నల్గొండ, గుంటూరు కృష్ణాజిల్లాల్లో మొత్తం 191 స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. ఈ స్టోరీ రాసే సమయానికి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కేవలం మూడు నుంచి నాలుగు అడుగుల నీటిమట్టమే వుంది. వాస్తవంగా 12 అడుగుల నీటిమట్టం ఉండాలి. పుష్కరాలకు పుష్కలంగా నీరొదిలే అవకాశం ఉండదనే ఉద్దేశంతో కాబోలు బ్యారేజీ దిగువ ఉన్న ఘాట్ల వద్దకు కాలువలు తీశారు. దీనిని బట్టి నదీ స్నానాలకు చెంబులు, లోటాలు ఉపయోగించే అవసరం రావచ్చునేమో అనిపిస్తోంది. పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని కృష్ణా పుష్కర పనులను చాలా ముందుగానే పూర్తి చేయాలని భావించినా, పుష్కరాల ప్రారంభం నాటికి కొన్నిచోట్ల అసంపూర్తిగానే మిగిలిపోయాయి. 24 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి 136 దేవాలయాలకు మరమ్మతులు చేపట్టారు.

పుష్కరాలు చారిత్రక ఆనవాళ్లు

పన్నెండేళ్లకోసారి వచ్చే పుష్కరాలు కాలగర్భంలో కలిసిపోయిన చారిత్రక ఆనవాళ్లకు కొనసాగింపు అని చెప్పవచ్చు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా మహా సమూహంగా ప్రజలు గుమిగూడే సందర్భమే పుష్కరం. పుష్కరాల వల్ల సామాజిక ఆలోచనా విధానం, సమగ్రతా భావం, ఇతరులతో కలిసి వంచుకునే ధోరణి అలవర్చుతాయన్నది పెద్దల భావన. నాగరికతకు మూలాధారమైన, జీవకోటికి ప్రాణాధారమైన నదిని ప్రేమించాలి. కనుక పుష్కరాల వంటి ఉత్సవాలు అటువంటి సందర్భాన్ని కల్పిస్తున్నాయన్నది ఒక అభిప్రాయం. నదులను పాడు చేయకూడదనే భావన, జలాలను సంరక్షించుకోవాలనే చేతన పుష్కరాల వల్ల ఏర్పడతాయని భావిస్తారు. ఎవరైనా ఏదైనా సహాయం చేస్తే మనం కృతజ్ఞత తెలుపుతాం. నది నీళ్లిస్తోంది. పెద్దవాళ్లు జన్మనిచ్చారు. కనుక నదికీ, పెద్దలకూ కృతజ్ఞతలను సమర్పించుకునే అవకాశం పుష్కర ఉత్సవాల వల్ల కలుగుతున్నదని కూడా భావిస్తున్నారు.

పుష్కరాలు 1800వ సంవత్సరం నుంచి క్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా రకరకాల పేర్లతో ఉత్సవాలు జరిగినట్లు చెపుతారు. తూర్పు ఇండియా కంపెనీకి చెందిన ఓ కమిషన్ 19వ శతాబ్ది తొలినాళ్లలో పుష్కర స్నానం ప్రమాదకరమని నివేదికల్లో పేర్కొన్నదట. అప్పట్లో నదీ ప్రవాహంలో మొసళ్లు ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం స్నానాలను ప్రోత్సహించలేదని, ఆ తరువాత నదుల్లో మొసళ్లు లేకుండా పోవడంతో పుష్కర ఉత్సవాలు జరపటం ప్రారంభించారని చరిత్రకారులు చెపుతున్నారు.

తెలుగువారి అలివేణి

కృష్ణానది తెలుగువారి జీవితాల్లో విడదీయరాని బంధంగా అల్లుకుపోయిన జలవాహిని. పురాణ, చారిత్రక అంశాలు ఎన్ని రకాలుగా చెప్పినా దక్షిణభారత ప్రజల జీవితాల్లో ఒక భాగంగా భాసిల్లుతోంది. పడమటి కనుమల్లోని మహాబలేశ్వర్ పర్వత శ్రేణుల్లో గోముఖ రూపంలో చెక్కబడిన శిల్పముఖం నుండి వెలువడిన జలధార కృష్ణానదిగా మారి ప్రవహిస్తోంది. ఈ నదీజలాలు లేత నీలిరంగులో ఉండటంవల్ల "కృష్ణానది" అనే పేరు వచ్చింది. ఇంకా ఎత్తుపై నుండి చూసినపుడు ఇది స్త్రీ జడపాయ(వేణి)గా కనిపించడం వల్ల కూడా కృష్ణవేణి అనే పేరొందింది. మహారాష్ట్రలో సముద్రమట్టానికి 1336మీటర్ల ఎత్తున మహాబలేశ్వరంలో పుట్టిన ఈ నది మొత్తం 1400 కిలోమీటర్ల పొడవున ప్రవహించింది. మహారాష్ట్రలో 306కి.మీ(76,252చ.కి.మీ), కర్ణాటకలో 482 కి.మీ. (69,425చ.కి.మీ), ఆంధ్ర ప్రదేశ్‌లో 612కి.మీ. (1,13,271చ.కి.మీ) ప్రయాణం చేస్తుంది. ఈ కృష్ణానది అరగాణి భారతదేశం వైశాల్యంలో 8 శాతంగా ఉంది. దీని పరీవాహ ప్రాంతం మొత్తం





బెజవాడ కనకదుర్గ దేవాలయం

ఆనకట్ట నిర్మాణం వల్ల కృష్ణానది ముంపుకు గురయ్యింది. ముంపుకు గురైన ఆలయాలను యదాతథంగా ఎత్తుప్రదేశాలలో పునర్నిర్మించారు. జూరాల ప్రాజెక్టును, బీచుపల్లి, సోమశిల ఆలయాలను, నల్లమల అడవులను దాటి శ్రీశైలంవద్ద పాతాళగంగగా పేరొందింది. శ్రీశైల భ్రమరాంబ భికా ఆలయాల కొండల అంచున ఒక ఆధునిక దేవాలయం, అదే శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు. విద్యుత్‌కే కాక వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందీ ప్రాజెక్టు.

గ్రంథస్తం చేశారు. తవ్వకాలలో బౌద్ధమత కట్టడాలేకాక కార్తికేయుడు, అష్టభుజస్వామి వంటి ఇతర హిందూ ఆలయాలు సైతం బయల్పడ్డాయి. కృష్ణాజలాలను పంటపొలాలకోసం వినియోగించేందుకు తలపెట్టిన నాగార్జునసాగర్ ఆనకట్టను 1955 డిసెంబర్ 10న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంఖుస్థాపన చేశారు. పదేళ్లపాటు నలభైవేలమంది ఈ ఆనకట్ట నిర్మాణంలో పాల్గొన్నారు. సాగర్‌ప్రాజెక్టు సమీపంలో ఎత్తిపోతల జలపాతం ఉంది. ఎకో టూరిజం ప్రాజెక్టుకింద సుమారు కోటిరూపాయలు ఖర్చుపెట్టి విద్యుత్‌వెలుగుజిలుగులు, కాటేజ్‌లు నిర్మించి పర్యాటకులను ఆకర్షిస్తున్నారు. కృష్ణానది సాగర్ ఆనకట్టను దాటి నల్లగొండజిల్లా వజీరాబాద్ వద్ద మూసీనదిని కలుపుకుంది. గుంటూరుజిల్లాలో ఒకనాటి ధాన్యకటకం అయిన అమరావతిలో అనేక బౌద్ధచారిత్రక కట్టడాలు, హైందవ కట్టడాలను దాటుకుంటూ కృష్ణాజిల్లా విజయవాడ చేరుకుంటుంది. ఇంద్రకీలాద్రిపై బెజవాడ కనకదుర్గ ఈ నదీతీరాన ఉండటం, వాణిజ్యపరంగా -ప్రయాణమార్గాలకూడలిగా అనువైన స్థలంగా ఉండటం వల్ల ఇక్కడ పుష్కరాలకు 'గిరాకీ' ఎక్కువ. ఇక్కడే 1852సం॥లో సర్ ఆర్థర్ కాటన్ 1.2కి.మీ.ల ఆనకట్టను నిర్మించారు. కృష్ణానదిపై తొలిఆనకట్టయిన దీనికి ప్రకాశంపంతులుగారి పేరుపెట్టి "ప్రకాశం బ్యారేజి" అన్నారు. ఈ నదీతీరాన కొండపల్లి కొయ్యబొమ్మలు, మచిలీపట్టణ రోల్డుగోల్డు, కలంకారీ కళాత్మక పరిశ్రమలు విలసిల్లాయి. కృష్ణానది ప్రవహించిన మొవ్వ, కూచిపూడి ప్రాంతాలు సంగీత, సాహిత్య, నృత్య కళావిపంచి పురివిప్పింది. క్షేత్రయ్యపదాలు, కూచిపూడి నృత్యాలు కృష్ణమ్మ తీరాన అలరారాయి. మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ కొండల్లో పుట్టిన కృష్ణానది ఇన్ని ప్రాంతాలను పరవశింపజేసి కృష్ణాజిల్లా అవనిగడ్డ-పులిగడ్డల వద్ద రెండుపాయలుగా చీలి హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తోంది. ఇదీ ఈ నదీమతల్లి ప్రస్థానం. ఇంతటి

2,51,000చ.కి.మీటర్లు. "మహారాష్ట్రసతారా జిల్లా కరాడ వద్ద కృష్ణానది 4,714 అడుగుల నుండి 1900 అడుగుల ఎత్తుకు తగ్గిపోయింది. 300మైళ్ళు కదిలి కర్నాటకలోని రాయచూర్ జిల్లాలో ప్రవేశించి మూడుమైళ్ళు ప్రవహించి 408అడుగుల కిందికి దిగడంతో ఇక్కడొక జలపాతం ఏర్పడింది. అదే "జలదుర్గ". ఆల్‌మట్టి, నారాయణపూర్ రాజర్వాయర్‌లను నింపుతూ ముందుకు సాగుతుంది. ఈ ఆనకట్టలు కృష్ణమ్మకు కర్ణాటకలోనేగాదు మహారాష్ట్రలో 'కొట్నీ' వద్ద 1868సం॥లో ఓ ఆనకట్ట పడింది. ఈనాటికీ ఆ ఆనకట్ట చెక్కుచెదరకుండావుంది. ఈ అడ్డుకట్టను దాటిన కృష్ణమ్మకు కొయినా, వరుణ, పంచగంగ, దూద్‌గంగ ఉపనదులు కలిశాయి. కర్ణాటకలో ఘటప్రభ, మలప్రభ ఉపనదులను కలుపుకుని బసవేశ్వరుడి ఆలయం ప్రక్కగా సాగింది. అస్పృశ్యతను పాటించని, విధవాపునర్వివాహాలను ప్రోత్సహించే వీరశైవులకు బసవేశ్వరుడు ఆరాధ్యదైవం. ఈ కృష్ణానదీ తీరాన్నే తళ్ళికోట వద్ద 1505సం॥లో జరిగిన యుద్ధంలో విజయనగర సామ్రాజ్యపతనం జరిగింది. దేవసుగుర్ వద్ద కర్ణాటకకు వీడ్కోలు పలుకుతుంది కృష్ణ. మన రాష్ట్రంలో మహబూబ్‌నగర్‌జిల్లా తంగిడి వద్ద కృష్ణానది ప్రవేశించింది". (శీలా వీర్రాజుగారి రచన "కృష్ణవేణమ్మ కథ" నుంచి)



కళ్యాణ చాళుక్య రాజు త్రిలోక్యమల్ల విక్రమాదిత్య-VI కాలంలో ఆలయపట్టణంగా పేరొందిన ఆలంపురం తాలూకా కుడవల్లి వద్ద కృష్ణానది, తుంగభద్ర నదిని తనలో కలుపుకుంది. చాళుక్యులే నిర్మించిన సంగమేశ్వరాలయం శ్రీశైలం

నాగరికత వికసించిన కృష్ణాతీరం

కృష్ణానదీతీరం నాగరికత రేకులు విప్పుకుని విజ్ఞాన పరిమళాలను మేధావుల ద్వారా దూర తీరాలకు చేరవేసిన ఘనత కలది. ఈ నదీలోయ దారిపొడవునా ఎందరో విజ్ఞానవేత్తలైన బౌద్ధభిక్షువులు "బుద్ధం శరణం గచ్ఛామి- ధర్మం శరణం గచ్ఛామి-సంఘం శరణం గచ్ఛామి" అంటూ త్రిరత్నావళి ఉచ్ఛస్వరంతో ఆలపించారు. ఈ నదీతీరంవెంబడి జరిగిన తవ్వకాలలో మనం గర్వించదగ్గ ఎన్నో నాగరికతా విశేషాలు వెలువడ్డాయి. క్రీ.శ. 2వ శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలం నుండి ఈ ప్రాంతం నాగరికతకు మెరుగులద్దింది. బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన చైనాయాత్రికులు ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్‌లు ఈ ప్రాంత చరిత్రను



పుష్కర ప్రస్తావన

పుష్కరం అంటే హైందవ కాలనిర్ణయంలో పన్నెండు సంఖ్య. అదీ కాలనిర్ణయంలోని 12రాశుల మూలంగా ఏర్పడింది. ఒక్కో రాశిలోకి బృహస్పతి ప్రవేశించినపుడు ఆయా నదులకు పుష్కరాలు వస్తాయనేది ప్రతీతి. మేషరాశిలో గంగకు, వృషభంలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో భీమనదికి, ధనస్సులో బ్రహ్మపుత్రకు, మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతనదికి పుష్కరాలు వస్తాయి.

రాజస్థాన్‌లోని పుష్కరతీర్థం వద్ద అపస్తంభుడు తన సూత్రాలు రాశాడని పండితులంటారు. ఆయన తెలుగువాడని అంటారు. నేటి పుష్కరాలకి ఈ పుష్కరసరస్సే మూలం అంటారు. ఈ పుష్కరజలాలు మోసుకుని కృష్ణానదికి పుష్కరాలు వస్తాయికదా...కానీ కృష్ణానది ప్రస్తావన సంస్కృత సాహిత్యంలో ఎందుకోగానీ లేదు. ఈ ప్రశ్నకు చరిత్రకారులు జవాబు వెతకాల్సివుంది. రాజస్థాన్‌లో పుష్కరప్రస్తావనేకాదు తెలుగుఛాయలుకూడా కనిపిస్తాయి. అక్కడి కోట గవనులనువారిని నేటికీ "ప్రోలు" అని వ్యవహరిస్తారు. ప్రోలు అనేది తెలుగు మాట. తెలుగునాట ఎన్నోగ్రామాలపేర్ల చివర ఈ పదముంది.

5 జిల్లాల్లో పుష్కరాల బందోబస్తు

ఎస్పిలు	:	15
ఎఎస్పిలు	:	36
డిఎస్పిలు	:	191
సిఐలు	:	723
ఎస్ఐలు	:	3,000
కానిస్టేబుళ్ళు	:	25,000
హోంగార్డులు	:	12,000
మహిళా కానిస్టేబుళ్ళు	:	1,205
మహిళా హోంగార్డులు	:	400
ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు	:	150
మొత్తం పోలీసు సిబ్బంది	:	45,000
మొత్తం భద్రతా ఖర్చు	:	రూ. 17 కోట్లు
పుష్కరాలు జరిగే ప్రాంతాలకు అదనపు		
బస్సు సర్వీసులు	:	1200
ప్రత్యేక రైళ్ళు	:	360

స్నానఘట్టాలు

కృష్ణాజిల్లా	:	100
గుంటూరుజిల్లా	:	47
నల్గొండజిల్లా	:	19
మహబూబ్‌నగర్‌జిల్లా	:	17
కర్నూల్ జిల్లా	:	8

సారవంతమైన, చారిత్రకమైన, సాంప్రదాయకమైన కృష్ణానదికి నిన్నటినుండి పుష్కరాల సంబరాలు.

పుష్కరం గురించి పురాణాలేం చెపుతున్నాయి

పూర్వకాలంలో 'తుందిలుదు' అనే ముని ఒక ఆశ్రమంలో నివసిస్తూ ఉండేవాడు. ఆయనకు నదిలో స్నానం చేయడమంటే చాలా ఇష్టం. తన ఆశ్రమం నుండి చాలా దూరం నడిచి వచ్చి, సూర్యుడు ఉదయించక ముందే నదీ స్నానం చేసేవాడు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ నది పాడయిపోవడం ప్రారంభించింది. మనుషులు నదిని కలుషితం చేశారు. తను ఎంతో ప్రేమించిన నది కలుషితం కావడం చూసి తుందిలుడు ఎంతో విచారించాడు. ఎలాగైనా నదీ కాలుష్యం తొలగించాలనుకొని ఈశ్వరుడి గురించి తపస్సు చేశాడు. కొంతకాలానికి ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. తుందిలుడి కోరిక విన్నాడు. జల కాలుష్యం తొలగించాలనే నీ కోరిక చాలా గొప్పది. అయితే ఆ కోరిక తీరాలంటే నీ ప్రాణాలు అర్పించాలన్నాడు ఈశ్వరుడు. వెంటనే ప్రాణాలు అర్పించాడు తుందిలుడు. అలా నీటి కాలుష్యాన్ని తొలగించడానికి ప్రాణాలు అర్పించిన తుందిలుడు ఒక శక్తిగా మారిపోయాడు. ఆ శక్తే పుష్కరుడు. ఏ నదికైనా పుష్కరాలు జరిగే కాలమంతా ఆ నదిలో పుష్కరుడు ఉంటాడు. నదీ స్నానానికి వచ్చిన వారందరినీ పుష్కరుడు ఆశీర్వదిస్తాడు.

ఈ విధంగా పురాణాల్లో పుష్కరాల గురించి రకరకాల కథనాలు ఉన్నాయి. అందులో పైన పేర్కొన్నది ఒక కథనం.

కృష్ణవేణి పై జానపద గాథ

విజయవాడను పూర్వం విజయవాటికాపురం అని పిలిచేవారు. ఒకప్పుడు భ్రమరాంబ మల్లేశ్వర ఆలయప్రాంగణంలో గొప్ప విద్యాలయం వుండేది. అది సకల కళానిలయం. ఆ విద్యాలయంలో వేణీనాథుడనే బ్రాహ్మణ యువకుడు ఉండేవాడు. అతడు సర్వశాస్త్ర పారంగతుడు. ఆ నగరంలో రంగసాని అనే నర్తకి ఉండేది. ఆమెకు కృష్ణకాంత అనే కుమార్తె అప్పుడప్పుడు ఆలయప్రాంగణంలో నృత్యంచేసేది. ఒకసారి దసరా ఉత్సవాల్లో కృష్ణకాంత నృత్యానికి వేణీనాథుడు గాత్ర సహకారం చేశాడు. ఒకరికొకరు ఆకర్షితులయ్యారు. కానీ చాలాకాలం కలుసుకోనేలేదు. ఒకసారి కృష్ణకాంత నదిలో స్నానం చేస్తున్న సమయంలో వేణీనాథుడు సంధ్యావందనానికొచ్చాడు. వారిద్దరూ అక్కడ చేరువయ్యారు. వారిద్దరూ మైమరచివుండగా చూసిన

(మిగతా 15వ పేజీలో..)

పుష్కరాలు ఆర్థికం - ఆరోగ్యం

పుష్కరాలు దానికి చెందిన భావజాలమంతా ప్రజలకు చెందిన వ్యక్తిగత విశ్వాసాలు. ఎవరు నమ్మితే వారు తమ తమ స్థాయిల్లో వాటిని ఆచరిస్తారు. పాటిస్తారు. వేడుక చేసుకుంటారు. కానీ ఒక లౌకికవాద ప్రభుత్వం భిన్నమతాలకు చెందిన ప్రజలందరికీ చెందిన ప్రజాధనం నుంచి బడ్జెట్టు కేటాయించి పుష్కరాలకోసం ఖర్చుపెట్టడం సరైందికాదు. ఆయా భక్తివిశ్వాసాలకు చెందిన ప్రజలు తమ దేవాలయాలకు, ఆధ్యాత్మిక నిధులకు సమర్పించిన మొక్కుల నిధుల నుంచి ఖర్చు చేయాలి. ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి ఎంత కేటాయించారో అంత డబ్బు పుష్కరాలకు కేటాయించడం ఎంతవరకు సబబౌతుంది. ఆ ధనం వెచ్చించి గ్రామాల నీటికరువుని తొలగించవచ్చు. హాస్పటల్స్ కేటాయిస్తే ప్రజలకు ఉచితంగా వైద్యమందించవచ్చు. ఈ పుష్కరాల సందర్భంగా లక్షలాదిమంది ప్రజలు ఒకచోటకి చేరుతున్నారంటే ప్రజారోగ్య వ్యవస్థలో తీవ్రస్థాయి డిస్టబెన్స్ జరుగుతుంది. తుఫాను, వరదల నష్టంలా కనబడేదిగా కాక వ్యక్తిగత, సామూహిక అనారోగ్యాల పాలవ్వడం, అందుకు ఎంతో డబ్బు ఖర్చు అవ్వడం జరుగుతుంది. ఏదిఏమైనా నమ్మకాలున్న ప్రజలు ఇలా ఒకచోటకు వస్తున్నందున వారికీ, వారివల్ల ఇతరులకు ఆరోగ్యపర జాగ్రత్తలకు, పరిసరాల శుభ్రతకు, వాతావరణకాలుష్య నివారణకు ఎక్కువ శ్రద్ధ, బడ్జెట్టు కేటాయించాలి. అంతేగానీ వ్యక్తిగత మతపర నమ్మకాలు మరింత పాదుకునేలా, ప్రాచుర్యం పొందేలా మత కర్మకాండలకు అధికప్రాధాన్యత ప్రభుత్వం ఇవ్వరాదు.

-గేయానంద్, జనవిజ్ఞాన వేదిక, రాష్ట్ర నాయకులు.

హేతువాదులు, భౌతికవాదులు ఏమంటారంటే...

ప్రముఖ ఆంగ్ల దినపత్రిక (23-8-04) లో 'మీ ఆత్మలను శుభ్రపరుచుకోవడానికి సబ్బు వద్దు' అనే వార్తావ్యాసం ప్రచురించింది. నదులు వనమూలికావిశేషాల మధ్యలోంచి ప్రవహిస్తూ వస్తాయి కనుక సబ్బు వాడితే వాటి విలువలు పోతాయని రాశారు. ఆ పన్నెండురోజులూ ఆ పుష్కరనదీజలాల్లో నూనెలేకుండా ఆవిరిపై ఉడికించిన పిండాలను నదిలో వదిలితే అవి తిని నదిలోని చేపలు బతుకుతాయని అన్నారు. అంటే ఆ పన్నెండురోజుల తరువాత 11ఏళ్ళ 11నెలల 18రోజులు చేపలకు ఉపవాసమేనా... ఆ పన్నెండురోజులు తప్ప నదీజలాల్లో మూలికావిశేషప్రభావాలుండవా అని చమత్కారభాణం సంధిస్తున్నారు. ఈ పుష్కరాల గురించి చెబుతున్న అంశాలన్నీ ప్రజల నమ్మిక, విశ్వాసాలమీద ఆధారపడ్డవే తప్ప వాస్తవ, భౌతికవాదాలముందు నిలబడేవి కావని అంటున్నారు. విశ్వాసం, నమ్మకాలకు వాస్తవం, నిజాలతో పనిలేదని, భావవాద, ఆధ్యాత్మికవాదానికి చెందినవారు వారివారి విశ్వాసాలకు అనుగుణంగా జరుపుకునేవి మాత్రమే అని, కొన్ని పరమమూఢంగానూ ఉంటాయని విమర్శిస్తున్నారు. ప్రజల మూఢనమ్మకాలపై ఓ పెద్ద భక్తిపరిశ్రమ, పెనువ్యాపారం నడుస్తోందని ఆరోపిస్తున్నారు. పుష్కరాలవంటి వాటికి ప్రభుత్వం పెద్దపెట్టున బడ్జెట్టు కేటాయించి, నకలఏర్పాట్లూ చేయడానికి పూనుకోవడం ఒక సెక్యులర్ ప్రభుత్వం చేయదగ్గపని కాదని అంటున్నారు.

పుష్కరస్నానాల వల్ల వచ్చే అంటువ్యాధులను మనమే అరికట్టుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాజేంద్ర ప్రసాద్ అంటున్నారు. కొన్ని లక్షలమంది ఒకేసారి స్నానం చేయడం వల్ల పుణ్యం మాటేమోగానీ అంటువ్యాధులు చాలా తేలికగా వ్యాపించే ప్రమాదం ఉందంటున్నారు. కండ్లలోకి కలుషిత నీరు వెళ్ళడం వల్ల కండ్ల కలక, పుండ్లు వస్తాయని, మలినపదార్థాల వల్ల కండ్లలోపల గాయం అయ్యేప్రమాదం ఉందంటున్నారు. కాంటాక్ట్ లెన్స్ ఉపయోగించేవారు వాటిని తీసేసి నదిలోకి దిగమంటున్నారు. వర్షాభావం వల్ల కృష్ణానదిలో నీరు అపరిశుభ్రంగా వుంటుంది. అలాంటి నీటిలో రోజుకి లక్షకు పైగా జనం స్నానంచేయడం, బట్టలుతకడం, టన్నులకొద్దీ పూజాద్రవ్యాలు వదవేయడం, మొక్కుపేరిట తీసిన తలవెంట్రుకలను నదిలో వేయడం, మలమూత్ర విసర్జనలు, ముక్కులు చీదడం, ఉమ్మడం ఇలాంటివెన్నో జరిగిపోతాయి. ఇలాంటి స్థితిలోని పుష్కరస్నానం వల్ల చర్మవ్యాధులు తగ్గిపోతాయని ఎవరు మాత్రం అనుకోగలరని అంటున్నారు. ఇలాంటి కాలుష్యాలతో నిండివున్న నీటిని నోటిద్వారా ఏ కొంచెం నీరు లోపలికిపోయినా కలరా, డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, పోలియో, మెదడువాపు మొదలగు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు, చంటిపిల్లలకు పాలిచ్చే తల్లులు, హెచ్ఐవి-ఎయిడ్స్ బాధితులు పుష్కరస్నానం చేయవద్దని సలహా ఇస్తున్నారు. స్నానఘట్టాలకు ఎగువ ప్రాంతంలో నీటిలో క్లోరిన్ కలిపి నీటిని శుభ్రపర చాలని, వ్యాధినిరోధక టీకాలు వేయాలని, అన్ని రకాల ఆరోగ్య సంరక్షణా చర్యలూ ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని, నదిలో పుష్కర స్నానం చేసివచ్చిన వారికి క్లోరిన్ కలిపిన మంచి నీటి స్నానానికి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఏమి దేబూక...!



“మా వాడు హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నాడటగదా! నీవు చూసావా?” అని ఆ పల్లెటూరి మనిషి ప్రొద్దుటూరి బస్టాండ్లో అడిగాడు. ఆయన్ను చూడగానే మొదట ఆశ్చర్యపోయాను. ఆయన ఆయనేనా అని కొద్దిసేపు సంశయించాను.

చెమికల రాజశేఖరరెడ్డి

“బాగున్నావా సిన్నాయనా...” అన్నాను. ఆయన నాకు వరుసకు సిన్నాయన అవుతాడు. పేరు రమణారెడ్డి.

“ఏదో ఇలా వున్నాము...” అంటూ నిర్లిప్తంగా బదులిచ్చాడు.

ఒకప్పుడు బాగా బతికిన పెద్దమనిషి. తెల్లటి బట్టల్లో కనిపించేవాడు. ఇప్పుడేమో మాసిపోయిన బట్టల్లో ముతకగా కనిపిస్తున్నాడు. ఒకప్పటి ఆయన రూపం నా కళ్ళముందుకొచ్చింది. గంజిపెట్టిన తెల్లచొక్కా, ఖరీదైన పంచె కట్టుకుని హుందాగా, శుభ్రంగా కనిపించేవాడు. పని వున్నప్పుడు అచ్చమైన శ్రామికునిలా ఒళ్ళొంచి విపరీతంగా శ్రమిస్తూ వుండేవాడు. చదువుకున్న రైతుగా ఆయనకు మా వూళ్ళో మంచి పేరుంది. వాళ్లది నలభై ఎకరాల వ్యవసాయం. పెద్ద ఇల్లు. అన్ని విధాలా అనువుగా వుండే కల్లం. రెండుజతల ఎద్దులు....పది పన్నెండు పాడి గేదెలతో ఇద్దరు ముగ్గురు పనివాళ్ళతో ఆదర్శరైతుగా రమణారెడ్డి పేరు సంపాదించుకున్నాడు. పొలం పనులు లేనప్పుడు ఇక్కడా అక్కడా కూర్చుని సోమరిపోతు మాటలు మాట్లాడకుండా ఏదో ఒకటి చదువుకోవడమో, లేదా ఇంటిపనులో చేస్తుండేవాడు. తండ్రి అకాల మరణం చెందడంతో చదువుతున్న ఇంటర్మీడియెట్‌ను మధ్యలోనే వదిలేసి ఇంటి బాధ్యతల్ని చేపట్టి ఆ తర్వాత ఉత్తమరైతుగా నిలిచిన రమణారెడ్డిని ఇప్పుడు ఈ బస్టాండులో దాదాపు అడుక్కునేవాడిరూపంలో చూసేసరికి మనసులో కెలికినట్లయింది.

“నిన్నొచ్చావటగదా హైదరాబాద్ నుంచి...ఎప్పుడైనా మావాడు నీకు కనిపిస్తుంటాడా?” సిన్నాయిన అడిగాడు.

“మీ తమ్ముడ్ని చాలా సంవత్సరాల తర్వాత మొన్ననే ఓ ఫంక్షన్లో కలిశాను. కూకట్‌పల్లిలో ఇల్లు కట్టుకున్నానని నాతో అన్నాడు. కూకట్‌పల్లి, భరత్‌నగర్ కాలనీలల్లో ఎక్కువగా మన రాయలసీమవాళ్ళే కనిపిస్తుంటారు. ఏవైనా పండగలప్పుడో, వివాహాలప్పుడో కలుసుకుంటూ వుంటాము. మీ వాడి గృహప్రవేశానికి హైదరాబాద్‌కు రాలేదా?” అన్నాను.

ఆయన మొహంలో రంగులు మారాయి. జర్నలిస్టును కావడంతో ఎదుటివాళ్ళ మొహంలోని మార్పుల్ని తొందర తొందరగా చదవడం అలవాటైంది. ఏదో జరిగిందనే విషయం అర్థమైంది.

“వాడికి మాకు రాకపోకలు లేవు. ఏదో నీలాంటివాళ్ళు హైదరాబాద్‌నుంచి వచ్చినప్పుడు వాడి సంగతులు తెలుస్తుంటాయి” అంటూ పాత సంచీని చేతులుమార్చుకున్నాడు. ప్రొద్దుటూరు దగ్గరుండే తొండళదిన్నె మా వూరు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామమే. ఇపుడు చంపడాలు, నరుక్కోవడాలు లేకపోయినా ఒకప్పుడు నాలుగు హత్యల్ని చూసిన వూరు. కమ్యూనిస్టు సాహిత్యంతో ప్రభావితుడైన చంద్రారెడ్డి కూలివాళ్ళకు అండగా నిలిచాడు. కూలిరేట్లు పెంచమని రైతుల్ని నిలదీసి పేదవాళ్ళ నాయకుడయ్యాడు. ఊర్లోని రోడ్లను వెడల్పు చేయాలనే సత్‌సంకల్పంతో రోడ్డుమీదకొచ్చిన ఇళ్ళను బలవంతంగా కత్తిరించాడు. దాంతో బలిసిన రైతులకు కోపమొచ్చింది. “వీడేంది కాపోడు... కాపోడిలా వుండకుండా ఏదో ఉద్ధరిస్తానని సన్నోళ్ళను నెత్తిమీద కెక్కించుకుంటున్నాడు. ఊరిని బాగుచేయడానికి పెద్ద మొగోడు బయల్దేరాడ”ని ఆస్తిపాస్తులు దండిగా వున్న రెడ్లు చంద్రారెడ్డిని చంపేసారు.

చంద్రారెడ్డినే నమ్ముకున్న సన్నోళ్లు అందుకు ప్రతిగా మూడు హత్యలు చేశారు. ఇప్పుడు ఊరిలో వర్గాలున్నాయిగానీ కరువు దెబ్బకు దడిసి ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ నిశ్శబ్దంగా వున్నారు.

తండ్రి హఠాన్మరణం తర్వాత రమణారెడ్డి చదువును మధ్యలోనే ఆపేసి పొలంపనులు చూసుకుంటూ ఇద్దరు తమ్ముళ్ళను చదివించాడు. పెద్ద తమ్ముడి చదువు ఇంటర్మీడియెట్‌తో ఆగిపోయింది. మూడోవాడు మాత్రం చురుకుగా చదివి ప్రభుత్వ ఉద్యోగయ్యాడు. హైదరాబాదులో ఉద్యోగం...

పక్కనే వున్న అరటిపండ్ల గంప దగ్గర బేరమాడుతున్నాడు రమణారెడ్డి. పండ్లన్నీ దాదాపు మెత్తగా వున్నాయి. ఆ పక్కనే తాజాగా మెరుస్తూ వున్న అరటిపండ్ల బండి వుంది. ఆ పండ్లు తీసుకోకుండా డజను ఐదురూపాయలకో, అంత తక్కువకో దొరికే అరటిపండ్లను ఆయన కొన్నారు. ఆయన మొహంలో దైన్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

గత ఐదు సంవత్సరాలుగా మాగాణి పంటలేదు. అన్నీ వర్షాధార పంటలే. కాలవకు నీళ్ళు రావడంలేదు. కారణం వర్షాలు తక్కువయ్యాయి. మరో పక్క ప్రభుత్వాల రైతువ్యతిరేక విధానాలు...దాంతో పెద్ద పెద్ద రైతులు సైతం చిన్నకారు రైతుల అవతారమెత్తారు. చాలా మంది అప్పుల విషవలయంలో ఇరుక్కొని వున్నారు. ఎవరెప్పుడు ఆత్మహత్య చేసుకుంటారోననే వాతావరణం ఊరంతా వుంది. గత పదిసంవత్సరాల్లో వివిధకారణాలతో ఆత్మహత్యలు చేసుకున్నవారి సంఖ్య మా ఊళ్ళో యాభైకి చేరుకుని వుంటుంది. ప్రతిగ్రామంలో రైతు బాగుంటేనే మిగతా వృత్తులవారు కూడా సంతోషంగా వుంటారు. భూమి మీద ఆధారపడ్డ రైతు ఆత్మహత్య చేసుకుంటే... కాలక్రమంలో ఆయన మీద ఆధారపడ్డ వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రైతు బాగుంటే ఎంతోమందిని ఆదరిస్తాడు. ఈ విషయం తెలుసుకోలేని ప్రభుత్వం దేశంలో రైతుల శాతం ఎక్కువని వారి సంఖ్యను తగ్గించడానికి విపరీతంగా శ్రమించింది. కాడికంటే కంప్యూటర్లు ముఖ్యమనుకుంది. ఫలితం రైతుల ఆత్మహత్యలు.

“ఈ రోజు హైదరాబాద్ వెళుతున్నాను. మీ తమ్ముడిని కలిస్తే ఏమైనా చెప్పాలా?” అన్నాను. “ఏం చెబుతావులే మాటలే లేనపుడు...వాడు మమ్మల్ని ఎప్పుడో మరిచిపోయాడు. రా అలా కూర్చుని మాట్లాడుకుందాం” అని ఆయన ఎదురుగా వున్న హోటల్లోకి దారితీశాడు.

కూర్చున్న తర్వాత రెండు కాఫీలు తెమ్మని చెప్పి “అసలేమయింది చిన్నాయనా! నీకు మీ తమ్ముడికి మధ్య మనస్పర్థలు ఎందుకొచ్చాయి? రమణారెడ్డి ఎంతగానో కష్టపడి తమ్ముడిని చదివించి ప్రయోజకుడిని చేశాడని ఊర్లో వారందరూ అంటూ వుండేవారు. మీ తమ్ముడు సుబ్బారెడ్డికూడా విపరీతంగా

పుస్తకాలు చదువుతూ పుస్తకాల పురుగనే పేరుతోపాటు ఆ తర్వాత ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు కదా!"

ఆయన గాల్లోకి చూస్తూ నిర్వేదంగా...నిస్సహాయంగా చెప్పడం మొదలుపెట్టాడు.

❋ ❋ ❋

"వాడు అడిగిన పుస్తకాలన్నీ కొనిచ్చాను. అకడమిక్ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలే కాకుండా, కాంపిటిటివ్ పరీక్షల పుస్తకాల్ని కూడా ఎంత డబ్బయినాపోసి కొనేవాడు. వాడిలో పట్టుదల చూసి అడిగినంత డబ్బు అప్పో సప్పో చేసి, పొలాలమ్మి ...నానా ఇబ్బందులు పడి మనీఆర్డర్‌లు చేశాము. ఉద్యోగం వచ్చిన తర్వాత నా పిల్లల్ని, నా పెద్ద తమ్ముడి పిల్లల్ని చదివించి పైకి తెస్తాడనే చిన్న స్వార్థం కూడా నా మనసులో వుండేది. ఉద్యోగమొచ్చి స్థిరపడ్డ తర్వాత మా మాట కాదని ఉద్యోగం చేసే అమ్మాయి కావాలని, అక్కడే కొలీగ్‌ను చేసుకున్నాడు. రెండు జీతాలు...ఒక జీతం ఖర్చులకు పోయిన ఇంకో జీతం మిగిల్చి బాగానే సంపాదించాడు. మమ్మల్ని కూడా ఆదుకుంటాడనుకుంటే మొండిచేయి చూపించాడు. ఆస్తిలో తన వాటాను కూడా తీసేసుకుని అమ్మేసుకున్నాడు కూడా. నా పిల్లల చదువుల గురించిగానీ, నా పెద్ద తమ్ముడి పిల్లల చదువులగురించి గానీ అడిగిన పాపాన పోవడంలేదు."



ఆయన కళ్లలో నీళ్ళు కనిపించాయి. మనసంతా కెలికినట్లయింది.

"అట్ల జరిగిందా! అయ్యో... సుబ్బారెడ్డి మంచివాడని అనుకున్నానే. ఆయన దగ్గర చాలా పుస్తకాలుండేవి... పుస్తకాలు బాగా చదివేవాళ్ళు మంచివాళ్ళ యివుంటారని నాకో నమ్మకం వుంది. నానమ్మకం తప్పని నిరూపించాడే సుబ్బారెడ్డి. ఆయన చదివించకపోతే పోనీగానీ మీరన్నా ఎలాగోలా చదివించండి మీ పిల్లల్ని..."

"లేదు...వ్యవసాయం బాగాలేదు... ఈ హోటల్లోనే మా పెద్దోడు సర్వర్‌గా పనిచేస్తున్నాడు. అదో ఆ మూలన నీళ్లు పోస్తున్నాడే ఆ పిల్లోడే మావాడు. ఒరేయ్ కిట్టూ... ఇట్ల రా..." అని ఆ మూలన సన్నగా పీలగావున్న పిల్లోడిని కేకేశాడు రమణారెడ్డి అనబడే ఒకప్పటి పెద్దరైతు. కిట్టూ దగ్గరకొచ్చాడు.

"ఈయన్ను గుర్తుపట్టావా! గోవిందరెడ్డి కొడుకు శివారెడ్డి. హైదరాబాద్‌లో వుంటున్నాడు." అని పరిచయం చేశాడు.

"ఎలాగోలా చదివించాల్సివుండేది. కనీసం పదో తరగతయిపోయినా బాగుండేది..." అన్నాను నేను. అంతకుమించి ఏం మాట్లాడాలో తెలియడంలేదు. ఇంకో అరగంటలో కొత్తబస్టాండు చేరుకోవాల్సి వుంది. అదే విషయం చెప్పి అక్కడనుంచి బయటపడి హైదరాబాద్ బస్సుకోసం కొత్తబస్టాండువైపు నడిచాను. మనసు భారమైంది. ఒకరినొకరు ఆదుకోని జీవితాలెందుకు? అనిపించింది. సుబ్బారెడ్డి రూపం ఓ సారి కళ్లముందు మెదిలింది.

❋ ❋ ❋

ఊరినుండి హైదరాబాద్ వచ్చి వారంరోజులైంది. మా ఎడిటర్ అప్పజెప్పిన హ్యూమన్ ఇంటరెస్టు స్టోరీస్ వర్క్‌లో బిజీ అయ్యాను. ఆ రోజు సాయంత్రం ఇంటికెళదామని బస్టాండులో నిలుచున్నాను. ఓ కారొచ్చి పక్కన ఆగింది. కారు అద్దాన్ని కిందకు దించి "హలో శివారెడ్డీ!" అంటూ సుబ్బారెడ్డి పలకరించాడు. "పనేం లేకపోతే మా ఇంటికి పోదాంరా" అంటూ ఆహ్వానించాడు.

కారు ఎక్కాను. ఏసీ కారు. కొత్తకారు. కారులోపలంతా ఆధునికంగా, హుందాగా వుంది. మ్యూజిక్ సిస్టమ్ ఆన్ చేశాడు. సంగీతం సన్నగా, హాయిగా వినిపిస్తోంది.

"ఊ...చెప్పు...ఏంటి కబుర్లు?" సంభాషణ ప్రారంభించాడు సుబ్బారెడ్డి.

నా ఉద్యోగ విషయాలు చెప్పడం ప్రారంభించాను. ఊరెళ్ళి వచ్చిన విషయం అతనితో చెబుదామనుకుని నోటిదాకా వచ్చి ఆగిపోయాను. బేకరీ పక్కన కారు ఆగింది. ఏదైనా తిని వెళదామని అన్నాడు.

చికెన్ బర్గర్లు వచ్చాయి. కూల్‌డ్రింకులు వచ్చాయి. ఐదువందల రూపాయల నోటును నిర్లక్ష్యంగా టేబుల్‌మీదకు గిరాటేశాడు సుబ్బారెడ్డి. మెత్తబడిన అరటిపండ్లను బేరమాడుతున్న సిన్నాయన రమణారెడ్డి మొహం నా కళ్ళముందు కదలాడింది. ఆయన చేతిలో మెత్తబడి, నలిగిన పదిరూపాయలనోటు స్పష్టంగా కదలాడింది. రమణారెడ్డి స్థితిని సుబ్బారెడ్డితో చెబుదామనుకున్నాను. ఎలాగూ ముందు ముందు ఊరిముచ్చట్లు ప్రస్తావనకొస్తాయి కాబట్టి అప్పుడు చెబుదామనుకున్నాను. తన కొత్త కారు మోడల్‌లోని వైవిధ్యంగురించి సుబ్బారెడ్డి చెప్పడం మొదలుపెట్టాడు. ఇరవై నిమిషాల్లో ఆయన ఇంటికి చేరుకున్నాము.

కారుదిగి ఇంట్లోకి వెళ్ళకముందే తన కొత్త ఇంటి నిర్మాణం సంగతులు మొదలుపెట్టాడు. బయటినుంచి చూడడానికి ఆ కొత్త ఇల్లు బ్రహ్మాండంగా వుంది. లేటెస్ట్ మార్బల్ స్టోన్స్‌తో, ఖరీదైనకలపతో, చక్కటి ఇంటీరియర్ డెకరేషన్‌తో ఇంటిలోపల వాతావరణం ఆకర్షణీయంగా వుంది. పదిహేను లక్షలు ఇల్లు కట్టడానికీ, మరో ఐదులక్షలు లోపలి డెకరేషన్‌కి అయ్యిందట.

"ఇతని పేరు శివారెడ్డి. మా ఊరే. ఇక్కడ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు" అంటూ భార్యకు పరిచయం చేశాడు. ఆమె చిన్నగా నవ్వింది. అది సహజమైన నవ్వు కాదని వెంటనే తెలిసిపోతోంది. 'ఎవరో అనవసరమైన వ్యక్తిలా వున్నాడు...ఎందుకొచ్చాడురా బాబూ!' అనుకుంటూ నవ్విన నవ్వు. ఆమె తిరిగి తమ 29 ఇంచ్‌ల టీవీలోని ఛానెల్స్‌ను మార్చడంలో నిమగ్నమయింది. కొత్తవాళ్లు ఇంటికి రాగానే కాళ్ళు కడుక్కోమని చెప్పి మంచినీళ్లో, మజ్జిగో ఇచ్చి కాస్త రిలాక్స్ కాగానే మంచిచెడ్డలు, క్షేమసమాచారాలు అడుగడం పల్లెటూళ్ళ సర్వసాధారణమైన విషయం. ఇక్కడంత టైమెవ్వరికీ లేదు. భర్తకోసం వచ్చినవాడు భర్తతోనే మాట్లాడి వెళ్ళిపోతాడు. భార్యకోసం వచ్చినవాళ్ళు భార్యతో మాట్లాడి వెళ్ళిపోతారు. పిల్లలకు తమ బంధువుల గురించిగానీ తమ ఇంటికి వచ్చిన వారిగుంచి ఏమాత్రం అవగాహన వుండదు. ఇదీ నగరాల్లో సర్వసాధారణంగా కనిపించే పరిస్థితి. ఒక పల్లెనుంచి ఇంకో పల్లెలోని బంధువుల ఇంటికి వెళితే ఆప్యాయతానురాగాల పరిమళాలు వీస్తాయి. ఇక్కడమాత్రం ముళ్ల మీదకూర్చున్న ట్టుంటుంది. ఎంత తొందరగా బయటపడితే అంతమంచి దన్నట్టుంటుంది.

సుబ్బారెడ్డి ఇల్లంతా చూపించడం మొదలెట్టాడు. కన్నకొడుకు గురించి చెబుతున్నంత ప్రేమగా ఆ ఇంటిలోని ప్రతిభాగం గురించి వివరిస్తున్నాడు. ఆయన కట్టుకున్న ఆ ఇంటిని గురించి మా ఇద్దరికీ తెలిసినవాళ్లదగ్గర నేను డాబుగా చెబుతానని అతని తాహతను ప్రచారం చేస్తాననే ధోరణి అతనిలో కనిపించింది. ఇది గెస్టరూమ్, ఇది మాస్టర్ బెడ్‌రూమ్, ఇది పిల్లల రూమ్. ఇది కిచెన్. ఇదంతా హాలు...ఇది అది అది ఇది...అని అతను చెబుతుంటే ఆ మాటలేవీ నా మెదడుకి ఎక్కడంలేదు. అతని మాటల్లో వస్తువులపట్లగల కాంక్ష అందులోనూ చక్కటి క్వాలిటీగల వస్తువులమీద గల ప్రేమ స్పష్టంగా వినిపిస్తోంది.

నీకున్న పెద్ద గెస్టరూమ్‌లో నీ అతిథులుగా వుండి నీ మర్యాదలు స్వీకరించేది నిన్ను పెద్దోడిని చేసిన నీ అన్నలు కాదు, వదినలు కాదు. వారి పిల్లలెంతమాత్రమూ కాదు. ఆ రూమ్‌లో పడుకునేది ఆర్థికంగా, సామాజికంగా నీ స్థాయిలోవున్న నీ స్నేహితులో, నీ భార్య తరుపువారో కదా అని మనసులో అనుకున్నాను.

ఏరు దాటిన తర్వాత తెప్ప తగిలేసినట్టు... ఏరు దాటేంతవరకు మా మల్లయ్య, ఏరు దాటిన తర్వాత బోడి మల్లయ్య అన్నట్టు, పాలు తాగి తల్లి రొమ్ము గుద్దినట్టు...ఐదువందల కిలోమీటర్ల దూరంలో పల్లెటూర్లో నీ వారిని వారి దరిద్రానికో, ఆత్మహత్యలకో వదిలేసి వారి సంగతులేవీ తెలుసుకోకుండా, వారికి సహకరించకుండా, ఇక్కడ లక్షలరూపాయల విలువ చేసే ఆధునికగృహాన్ని నిర్మించుకున్నావు. కారు కొన్నావు. నీ భార్య నగలుకొంది. నీ పిల్లలు బొద్దుగా వున్నారు. కానీ అక్కడ ఆ పల్లెటూర్లో మసిబారిన కొంపలో నిస్సహాయంగా, కసాయి కరువు కౌగిట్లో నీ వాళ్ళు గిలగిలా కొట్టుకుంటున్నారు. ఒరేయ్ సుబ్బారెడ్డి! నీ అంత దుర్మార్గుడు ఎవడూ లేడురా...అని అందామనిపించింది.

సెక్స్‌మయం హింసమయం

అంపశయ్య నవీన్

“యే సినిమా చరిత్ర చూసినా యేమున్నది గర్వకారణం. సినిమాలు సమస్తం సెక్స్‌మయం - హింస మయం అని నువ్వు అంటావని నాకు తెలుసు”

“యేమిటి సంగతి? ఎక్కడికెళ్ళొస్తు న్నావు?”

“ఇప్పుడే ఓ మంచి సెక్స్ సినిమా చూసొస్తున్నా..”

“అందుకేనా... ఇంత హుషారుగా కనిపిస్తున్నావు...”

“అవునుమరి...మనసును ఉద్రూతలూగించడానికి సెక్స్‌కు మించిన సాధనమేమున్నది చెప్పు? కాటికి కాళ్ళు చాపుకొని ఉన్నవాడు కూడా సెక్సనగానే లేచి నిల్చుంటాడు. సెక్స్‌లో అంత మహాత్యం ఉంది...”

“నువ్వన్నంత మహాత్యం సెక్స్‌లో యేమీ లేదు - జీవితానికి సెక్స్ కూడా ఒక అవసరమే - కాదనను - కానీ అదే సర్వస్వం కాదు - యువతరానికి సెక్స్‌యావ కొంచెం ఎక్కువగానే ఉంటుంది - దాన్నే మన సినిమాలు క్యాష్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ మధ్య మన సినిమాల్లో సెక్స్‌ను చూపించడం మరీ ఎక్కువైపోయింది - ఈ మధ్య వచ్చిన కొన్ని హిందీ, తెలుగు సినిమాలను చూస్తూంటే మనకసలు సెన్సార్‌బోర్డు అనేది ఉందా? లేక అదృశ్యమైపోయిందా? అన్న సందేహం కల్గుతోంది.”

“సినిమాల్లో సెక్స్ చూపిస్తే తప్పులేదంటాను - ఇవ్వాళ్ళ అమెరికాలోంచి దిగుమతవుతున్న సినిమాల్లో నగ్న దృశ్యాలుంటున్నాయి. బెడ్‌రూం దృశ్యాలుంటున్నాయి - వాటిని తెలుగులోకి చేసి చూపిస్తున్నారు. వాటి పోటీకి తెలుగు సినిమాలు, హిందీ సినిమాలు తట్టుకోవాలంటే వీటిలో కూడా సెక్స్ సీన్స్‌ని జొప్పించాలి. లేకపోతే అందరూ అమెరికానుండో, ఇంగ్లాండ్‌నుండో దిగుమతవుతున్న సినిమాల్నే చూస్తారు - మన సినిమాల్ని ఎవరూ చూడరు. మన టాలీవుడ్ మీద బాలీవుడ్ మీద ఆధారపడి లక్షలమంది బతుకుతున్నారు. మన సినిమా ఇండస్ట్రీస్ మూతపడ్తే వీళ్ళందరేమయిపోవాలి!

“నువ్వన్నది మనం మాటవరసకు ఒప్పుకుందాం. కానీ సెక్స్‌ను విచ్చలవిడిగా చూపించిన సినిమాలు కూడా బాక్సాఫీసు దగ్గర బోల్తా కొడ్తున్నాయి కదా. మొన్ననే ఓ పేపర్లో చదివాను.. ఈ సంవత్సరం మొదటి అర్ధభాగంలో అరవై తెలుగు సినిమాలు విడుదలయ్యాయట - వాటిల్లో కేవలం ఆరంటే ఆరు సినిమాలు మాత్రమే విజయవంతమయ్యాయి. మిగతా సినిమాలన్నీ ఘోరంగా దెబ్బతిన్నాయట. దీనికి కారణమేమిటంటావ్?”

“కేవలం సెక్స్ ఒక్కటే సినిమాను రక్షించదు - సినిమాల్లో చాలా ఉండాలి. అందులో సెక్స్ కూడా ఒకటి - ఈ మధ్య తెలుగు సినిమాల్లో కంటే హిందీ సినిమాల్లో సెక్స్‌ను మరీ ఎక్కువగా చూపిస్తున్నారు. పెద్దపెద్ద స్టార్స్‌తో కాకుండా ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి ప్రవేశిస్తున్న చిన్న స్టార్స్‌తో సినిమాల్ని నిర్మించుతున్నారు. ఇలాంటి సినిమాలు చాలా తక్కువ బడ్జెట్‌లో పూర్తవుతాయి. కాబట్టి వీటికి కొంచెం డబ్బొచ్చినా చాలు. ఈ సినిమాల్లో స్త్రీ-పురుషుల మధ్య వివాహేతర సంబంధాల్ని ఎక్కువగా చూపిస్తున్నారు. ఇంచుమించు పడక దృశ్యాల్ని కూడా చూపించేంతవరకు మన దర్శకులు వెళ్తున్నారు. ఇప్పుడే నేను చూసొచ్చిన సినిమాలో పెళ్ళయి, ఓ పాపకూడా ఉన్న ఓ భార్య ఒకప్పటి తన ప్రియునితో సంబంధం పెట్టుకోవడం, భర్తకు తెలియకుండా ప్రియుని దగ్గరకు వెళ్ళిరావడం, అది తెలిసి భర్త వాడిని చంపేయడం-ఇదీ కథ. వీళ్ళిద్దరి మధ్య జరిగేదంతా దర్శకుడు మన ఉహాకేదీ వదలిపెట్టకుండా అంతా చూపించాడు. తక్కువ బడ్జెట్‌తో నిర్మించబడిన ఈ సినిమా బాగా పోయింది. దాంతో అందరూ ఇలాంటి కథల్నే తెరకెక్కిస్తున్నారు. అదీ కథ ఎలా ఉంది?

పరమ దరిద్రంగా ఉంది. సినిమా అంటే లక్షల మంది చూస్తారు. ఓ మంచి సందేశం ఉంటే ఆ సినిమా సమాజాన్ని కొంచెమైనా బాగు చెయ్యడానికి తోడ్పదుతుంది...”

“సినిమాల వల్ల సమాజం బాగుపడ్తుందంటావా?”

“బాగుపడటం మాట దేవుడెరుగు. సినిమాల వల్ల సమాజం చెడిపోతున్నదనిమాత్రం కచ్చితంగా

చెప్పగలను...”

“ఎలా చెప్పగలవు?”

“మొన్న మన విజయవాడలో ఓ కాలేజిలో పట్టపగలు ఓ యువకుడు కొన్ని వందలమంది తోటి విద్యార్థులు చూస్తుండగా అమ్మాయి తలనరికి చంపేశాడు. ఎందుకంటే అతడా అమ్మాయిని ప్రేమించాడట!.. ఆ అమ్మాయి అతని ప్రేమను తిరస్కరించిందట!... ఇలాంటి దారుణాలు సినిమాల ప్రభావం వల్లనే జరుగుతున్నాయని నాకనిపిస్తున్నది. ఇవ్వాళ్ళ యేసినిమా చూసినా కాలేజిలో చదువుకునే యువతీ యువకులకు ప్రేమించుకోవడం తప్ప మరో పని లేదన్నట్టు చూపిస్తున్నారు. ఓ అమ్మాయిని ఓ అబ్బాయి ప్రేమిస్తాడు. ఆ అమ్మాయి అతన్ని ప్రేమించదు... ఎందుకు ప్రేమించవని వీడా అమ్మాయి వెంటపడి ఆమెను అనుక్షణం వేధిస్తుంటాడు. నువ్వు నన్ను ప్రేమించకపోతే చస్తాననో, నిన్ను చంపేస్తాననో బ్లాక్‌మెయిల్ చేస్తాడు. చివరకు వాడి హెరాస్‌మెంట్‌ను భరించలేక ఆ అమ్మాయి వాడిని ప్రేమించానంటుంది. సినిమాల్లో ఇలాంటి దృశ్యాల్ని చూసిన మన యువకులు కూడా ఓ అందంగా ఉన్న అమ్మాయిని చూడటం.. నిన్ను ప్రేమిస్తున్నానని వెంట పడటం.. పిచ్చిపిచ్చి వేషాలన్నీ వెయ్యడం.. ఆ అమ్మాయి అతని ప్రేమను తిరస్కరిస్తే చంపేస్తానని బ్లాక్‌మెయిల్ చెయ్యడం.. ఆ అమ్మాయి ఎంతకు లొంగకపోతే ఆ అమ్మాయిని నిజంగానే చంపెయ్యడం.. ఇదీ జరుగుతున్నది. ఈ సినిమాల కారణంగానే ఈ సోకాల్డ్ ప్రేమ లేక లవ్ అనేది మన యువకుల్లో కొందరికి ఒక అబ్సెషన్‌లా.. అంటే నిరంతరం బుర్రలో మెదిలే ఓ ఆలోచనాశకలంగా మారిపోతున్నది. ప్రేమ...ప్రేమ..ప్రేమ.. ఇదే యావ. ఎవరినో నేను ప్రేమిస్తున్నాను.. ఎవరో నన్ను ప్రేమించాలనే ఓ గాఢమైన వాంఛ...సినిమాల్లో కనిపించే ఈ ప్రేమ వాస్తవ జీవితంలో కనిపించదు.. ఈ వైరుధ్యాన్ని మన యువకులు అర్థం చేసుకోలేరు. సినిమాల్లో అంత పుష్కలంగా కనిపించే ప్రేమ వాస్తవజీవితంలో కనిపించకపోవడంతో మన యువకులకు పిచ్చెక్కుతుంది. ఆ పిచ్చి వాళ్ళను ఎంతటి అఘాయిత్యాలకైనా పాల్పడేలా చేస్తున్నది.”

“ఇంత అనర్థం సినిమాల వల్ల జరుగుతున్నదంటే నేను నమ్మలేను - ఓ రెండున్నర గంటలు సరదాగా, సంతోషంగా గడుపుదామని మనం సినిమాలు చూడటానికెళ్తాం. సినిమాలో చూపిస్తున్నవన్నీ వాస్తవజీవితంలో జరగవని అందరికీ తెలుసు. సినిమా ప్రపంచం కేవలం కలల ప్రపంచమని మనలో తెలియనివాళ్ళెవరుంటారు? సినిమాలు నిజంగా సమాజాన్ని నువ్వన్నంతగా ప్రభావితం చేస్తే సినిమాల్లో ఎన్నో మంచి విషయాలు కూడా చూపిస్తారుగదా.. అధర్మం మీద ధర్మమే గెలిచినట్టుగా చూపిస్తారుగదా.. అధర్మానికీ, అక్రమాలకూ పాల్పడ్డవాళ్ళకు చివరకు కఠినశిక్షలు విధించినట్టుగానే చూపిస్తారుగదా.. అలాంటప్పుడు సమాజంలో ఇంత అధర్మం, ఇన్నీ అక్రమాలు జరగకూడదు కదా!”

“అధర్మం ఓడిపోయినట్టుగా, ధర్మం గెలిచినట్టుగా, నేరం చేసిన వాడికి శిక్ష పడినట్టుగా ఒకప్పటి సినిమాల్లో చూపించేవాళ్ళు.. ఇప్పటి సినిమాల్లో అలా చూపించడం లేదు! ఇంతకు ముందు నువ్వు చెప్పిన సినిమాలకథలో మర్డర్ చేసినవారు హాయిగా ఉన్నట్టుగా చూపిస్తూ సినిమా ముగించారని చెప్పావు. ఇవ్వాళ్ళ వస్తున్న ఎన్నో సినిమాల్లో ప్రేమ పేరుతో ఆడపిల్లల్ని వేధించిన వాళ్ళకేమన్నా శిక్ష పడ్తున్నదా? వాళ్ళ వేధింపులను భరించలేక ఆడపిల్లలు కూడా అలాంటి రౌడీలను, గూండాలను, హంతకులనూ ప్రేమించినట్టు చూపిస్తున్నారు. ఒకప్పటి సినిమాల్లో హీరోలను ఆదర్శ పురుషులుగా చూపించేవాళ్ళు. ఆనాటి సినిమా హీరోలు కష్టపడి చదువుకునేవాళ్ళు. ఫస్ట్‌క్లాస్‌లోనే ప్యాసయ్యేవాళ్ళు. కేవలం వాళ్ళ తెలివితేటలతో, ఉదాత్తగుణాలతో ఆడపిల్లల్ని ఆకర్షించే వాళ్ళు... అలా ఆడపిల్లలు వాళ్ళ ప్రేమలో పడేవాళ్ళు. కానీ ఇప్పటి సినిమాల్లో కనిపించే హీరోలు చదువురాని మొద్దులు.. ఎప్పుడూ పరీక్షల్లో ఫెయిలయ్యేవాళ్ళు. రౌడీలను వెంటేసుకొని తిరిగేవాళ్ళు. స్వయంగా వాళ్ళే రౌడీలు. దొంగతనం చేసేవాళ్ళు - హత్యలు చేసేవాళ్ళు! ఈనాటి సమాజంలో విలువలు పతనమైపోవడానికి సినిమాలు కూడా ఒక కారణమని నా ధృఢమైన అభిప్రాయం.

పరీక్ష

మాదుగుండు కృష్ణ

హైదరాబాద్‌లో కనకయ్య అనే గజదొంగ వుండేవాడు. వాడు తలచుకుంటే ఎంతటి వారింటికైనా కన్నం పెట్టి ధనరాసుల్ని కొల్లగొట్టుకొని పోగలడు.

నిజలింగప్ప గొప్ప శ్రీమంతుడు. కనకయ్య వంటి గజదొంగల బారిన పడకుండా వుండాలంటే వాచ్‌మేన్‌ని పెట్టుకోవాలనుకున్నాడు. గంగయ్యను కాపలా దారునిగా నియమించాడు. కొత్తగా వచ్చిన గంగయ్య పొడవాటి మీసాలతో కండలు తిరిగిన మనిషి. ధైర్యసాహసాలున్న వ్యక్తి. ఈ పని చేయడానికి ధైర్యసాహసాలే కాదు. నమ్మకం కూడా అవసరమని చెప్పాడు నిజలింగప్ప.

కనకయ్య కన్ను నిజలింగప్ప ఇంటి మీద పడింది. ఓ అర్ధరాత్రి అతను నిజలింగప్ప భవనంలోకి ప్రవేశించాడు. హుషారైన వాచ్‌మేన్ గంగయ్య అతనికి ఎదురువచ్చాడు. వాచ్‌మేన్ చేతిలో తుపాకీ వుంది.

కాల్చుతాడేమోనని భయమేసింది కనకయ్యకు. తుపాకీ గురిపెడ్తూ కనకయ్యను సమీపించాడు గంగయ్య. భయంతో కనకయ్య కదలకుండా అలాగే వుండిపోయాడు. "ఎవరు నువ్వు? కాల్చిపారేస్తాను ఏమనుకుంటున్నావో'' నిలదీశాడు గంగయ్య

"నేను కనకయ్యను" జవాబిచ్చాడు దొంగ.

అప్పుడు గంగయ్య తుపాకీ పేల్చకుండా కిందకి దించాడు. పైగా చిరునవ్వు నవ్వి కనకయ్యను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. "నువ్వు ఏనాటికైనా వస్తావని ఊహించాను. మరేం కంగారు పడకు. ఇంట్లో ఎవరూ లేరు. ఊరెళ్లారు. నువ్వు నాకు సగం వాటా ఇస్తానంటే ధనాగారానికి దారి చూపిస్తా. లేదా పిట్టను కాల్చినట్టు కాల్చేస్తా..." చెప్పాడు గంగయ్య.

"నీ సహాయం నాకవసరం. నువ్వు చాలా మంచివాడివి. కొల్లగొట్టిన దాంట్లో నీకు నగమిస్తా'' వాగ్దానం చేశాడు దొంగ. సునాయాసంగా ధనాగార గృహంలోకి అడుగుపెట్టాడు కనకయ్య. అతికష్టమ్మీద ఖజానాను పగులగొట్టి విలువైన వజ్రాలు, నగలు, ధనం మూటకట్టుకొని బయటపడ్డాడు.

"వచ్చావా కనకయ్యా! రా... రా... అటువైపు చెట్ల పొదల్లోకి వెళ్దాం. అక్కడ మనం వాటాలు వేసుకుందాం" ఆతృతపడ్డాడు గంగయ్య.

"నువ్వెవడ్రా? నీకెందుకు వాటా ఇవ్వాలి? దొంగతనం చేసింది నేను. సొమ్మంతా నాకే చెందుతుంది. అడ్డు తొలగు" బెదిరించాడు కనకయ్య.

"ఒరే ద్రోహీ... నేను ఈ ఇంటి కావలాదారుణ్ణిరా. నిన్ను లోనికి పోనిచ్చింది నేనే. న్యాయంగా సగం వాటా ఇవ్వక తప్పదు. ఇస్తానని మాట ఇచ్చావు కూడా...'' బెదిరించాడు గంగయ్య.

"ఏది న్యాయం? ఎవరు ద్రోహి? స్వామిద్రోహివి నువ్వు. నీమీద నమ్మకముంచి నిన్ను వాచ్‌మేన్‌గా పెట్టుకున్నాడు యజమాని. అతనికి అన్యాయం జరిగింది. అతడు మోసపోయాడు" అన్నాడు కనకయ్య కోపంగా.

"నీతులు చెప్పకు. వాటా ఇస్తావా? లేదా? లేకపోతే కాల్చిపారేస్తాను" అని తుపాకీ గురిపెట్టాడు గంగయ్య.

తక్షణమే గజదొంగ కనకయ్యగా వేసుకున్న వేషాన్ని తొలగించాడు నిజలింగప్ప. అది చూసి వాచ్‌మేన్ గంగయ్య తల తిరిగిపోయింది. అంటే నిజలింగప్ప తనను పరీక్షించడం కోసమే కనకయ్య రూపంలో నాటకమాడాడనుకున్నాడు. పైగా 'ఆరు మాసాల్లో ఎప్పుడో ఒకసారి నీ నిజాయితీని పరీక్షిస్తాను. నెగ్గితే ఆ తర్వాత శాశ్వతంగా పనిలో పెట్టుకుంటాను' అన్న యజమాని మాటలు గుర్తొచ్చాయి గంగయ్యకు. తన తప్పు తెలిసి సిగ్గుతో తలవంచుకొని అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. అంతేకాదు యజమానికి ద్రోహం చేయాలనుకోవడం వల్లే నోటి దగ్గర



చిన్నారి చిత్రకారులు

పి.సాంబశివరావు, 10వ తరగతి, జెడ్‌పిహెచ్‌స్కూల్, చందర్లపాడు.



కె.సూర్య తేజ, 7వ తరగతి, ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్యనగర్.

జి.అంజలి, 8వ తరగతి, ఎస్‌ఎపిక్యాంప్.



డి.శుభకర్, 7వ తరగతి, సెయింట్ జోసఫ్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్.

వై.వెంకీ, 9వ తరగతి, జిల్లా పరిషత్ బోయిన్ హైస్కూల్, చెన్నూరు, నెల్లూరు.



వి'చిత్రం'

నేస్తాలూ! ఏం చేస్తున్నారు? ఇవాళ మిమ్మల్ని ఓ క్లిష్టమైన ప్ర
అడగబోతున్నాం. దానికి మీరు గబాల్న సమాధానం చెప్పాలి. మరి రెడీన

పైన ముగ్గురు బుడ్డోళ్లు ఎంచక్కా వరుసగా నిలబ
వున్నారుకదా. వాళ్లల్లో ఎవరు పొడవో చెప్పాలి. 'ఓస్ ఇంత బుల్లి ప్రశ్న
కూడా సమాధానం చెప్పలేమా!' అనుకుంటున్నారు చిన్నారులంతా. మ
చెప్పండి చూద్దాం.

'ఆ... కుడివైపునుంచి మొదట నిలబడిన అబ్బాం
అందరికన్నా ఎత్తుగా వున్నాడు. పెద్ద దానిక్కూడా...' అంటున్నారర్రా చా
మంది నేస్తాలు. కానీ అలా అన్నవాళ్లంతా తప్పులో కాలేసిన
ఎందుకంటే ఆ ముగ్గురి ఎత్తూ ఒక్కటే. కావాలంటే పిలక దగ్గరనుం
కాళ్ల వరకు స్కేలు పెట్టి కొలిచి చూడండి. అయినా మీకు ఆ శ్ర
అక్కర్లేదులే. ఆ పని మేం ముందే చేసేశాం.

మీరూ బొమ్మలేస్తారా!

అయితే ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా మాకు పంపండి. ఎంచ
ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి,
నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

రంగులు పులిమేద్దామా!

అబ్బో! ఎన్ని రంగులో!!

N	E	E	R	G	O	O	L	I	V	E
O	I	Z	E	G	N	S	T	W	X	H
I	H	F	I	G	E	A	K	A	U	U
M	S	D	E	G	N	L	Y	N	N	Z
K	N	U	R	R	X	A	P	C	I	Z
I	L	A	E	O	W	U	R	R	Y	P
B	Y	D	H	C	A	E	P	O	U	S
B	L	A	C	K	W	H	I	T	E	P
V	I	O	L	E	T	O	C	R	K	O
X	Y	C	N	L	W	O	L	L	E	Y
B	E	I	G	E	B	R	O	W	N	U

ఇంగ్లీషు పజిల్-4

హాయ్! మీకు రంగులంటే ఇష్టమేనా? అయినా రంగులను ఇష్టపడని పిల్లలు వుండరనుకోండి. పైన బోలెడన్ని ఆంగ్ల అక్షరాలు వున్నాయికదా. అందులో 18 రంగులు వున్నాయి. అవి ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించాల్సిన పని మాత్రం మీదే. మీరు ఎన్ని రంగులను కనిపెట్టారో కార్డుమీద రాసి మాకు పంపండి. ఎక్కువ రంగులను వెతికి పట్టుకున్న వారి పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పజిల్-3 సమాధానం



పజిల్-2కు సమాధానాలు రాసినవారు

సి.హెచ్. బాలకృష్ణ, 8వ తరగతి, కుసుమగుడ్డివీధి, పార్వతీ పురం. **బి. అఖిల్ నాగేంద్ర**, 5వ తరగతి, పాల్వంచ. **వి. రాజా వంశీధర్** 7వ తరగతి, **వి. సౌమ్య**, 5వ తరగతి, ఈమని. **కాలువ శ్రీ అనూహ్య**, 6వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు.

దీర్ఘముఖుడు-పక్షులు

దీర్ఘముఖుడు తన తోటి పక్షులతో మాట్లాడుతూ, "ఆ పక్షి చెప్పిన కథ విని నాకు చాలా కోపం వచ్చింది. కానీ నిగ్రహించుకొని, 'మిత్రులారా! మీరు చెప్పిన కథ బాగానే వుంది. కానీ మహా బలవంతుడైన మా హంసరాజును బలహీనుడనటం బాగాలేదు. మా రాజు కాలు కదిపితే ఈ లోకమే అదిరిపోతుంది. అతను కర్పూరద్వీపానికే కాదు. ఈ లోకం అంతటికీ రాజు కాదగినవాడు' అన్నాను. ఆ వెంటనే పక్షులు నా పెడరెక్కలు విరిచికట్టాయి. వాళ్ల రాజు చిత్రపర్ణుని ముందు నిలబెట్టాయి.

"ప్రభూ! వీడు మన రాజ్యంలో తిరుగుతూ మనల్నే నిందిస్తున్నాడు. మిమ్మల్ని అనరాని మాటలు అన్నాడు. వీడిని చంపడానికి అనుమతివ్వండి" అన్నాయి పక్షులు.

"ముందు ఆ కట్లు విప్పండి" అని నెమలిరాజు చిత్రపర్ణుడు అన్నాడు. పక్షులు నా కట్లు విప్పాయి. "నువ్వెవరు? ఎక్కడ నుండి వచ్చావు?" అని చిత్రపర్ణుడు ప్రశ్నించాడు.

నన్ను జవాబు చెప్పనివ్వకుండా ఒక కాకి కల్పించుకొని, "ప్రభూ! వీడు హిరణ్యగర్భుడనే హంసరాజు సేవకుడు. పేరు దీర్ఘముఖుడు. కర్పూరద్వీపం నుండి వచ్చాడు" అని చెప్పింది.

"మీ మంత్రి ఎవరు? ఏం చదివాడు?" అని చిత్రపర్ణుడు మళ్లీ అడిగాడు.

"మా మహారాజుగారికి సర్వరాజు అనే కొంగ మంత్రి. ఆయన సకలశాస్త్ర పారంగతుడు. గుణవంతుడు. రాజ్యపాలనలో తన శక్తినంతా ధారపోస్తున్న త్యాగధనుడు" అన్నాను నేను.

అది విని ఒక ముసలి చిలుక హేళనగా చప్పట్లు చరిచింది. "వీడు చెప్పేవి నీతులు. తీసేవి గోతులు. వీడి నీతులతోనూ, వీడి మంత్రితోనూ మనకేం పని? మనకు కావాల్సింది రాజ్య విస్తరణ. ఆ హంసరాజు మనకు సామంతుడు కావడమో లేక యుద్ధానికి సిద్ధపడటమో జరగాలి. తృప్తిలేని విప్రుడు, తృప్తి చెందిన రాజు చెడిపోతారని అంటారు. రాజు అనే వాడు వున్నదానితో తృప్తిపడక రాజ్య విస్తరణకు కృషి చేయాలి. రాజ్యం వీరభోజ్యమనే మాట మీకు తెలియనిది కాదు. మనం కర్పూరద్వీపం మీద దండెత్తుదాం. వారు దారికి వస్తే సరేసరి, లేకపోతే వారికి తగినశాస్తి చేసివద్దాం" అంది. దాని మాటలకు తలవూపుతూ చిత్రపర్ణుడు, "ఓయీ! మీ రాజును యుద్ధానికి సిద్ధం కమ్మని చెప్పు" అన్నాడు. "అయితే మీ దూతను పంపండి" అన్నాను.

అప్పుడు చిత్రపర్ణుడు అతని సహచరులందరినీ కలయజూశాడు. "సహచరులారా! మన తరఫున దూతగా ఎవరిని పంపుదాం? దూతగా వెళ్లేవాడికి రాజభక్తి, దేశభక్తి, ప్రతిభ, ఓర్పు, సమయానికి తగినట్లు వ్యవహరించే నేర్పు వుండాలి. అలాంటివారు మనలో ఎవరు?" అంటూ ప్రశ్నించాడు.

అప్పుడు గద్ద మంత్రి లేచి, "చిలుకలలో తెలివైన అరుణముఖుడిని పంపుదాం. అతను తీయగా మాట్లాడగలడు. గుణవంతుడు. అన్నిటికీ మించి వయస్సులో తల పండినవాడు. శాంత స్వభావుడు. అతణ్ణి మన రాయబారిగా పంపుదాం" అన్నాడు.

అప్పుడు అరుణముఖుడనే ఆ చిలుక రాజు ముందు వాలి, "ప్రభూ! ఈ కొంగ టక్కరిది. దారిలో నన్ను చంపినా చంపవచ్చు. అప్పుడు నాకు దిక్కెవరు? నేను ఈ దీర్ఘముఖునితో వెళ్లలేను. దుష్టులు చెడ్డపనులు చేస్తారు. వాటివల్ల కలిగే చెడు ఫలితాలను మంచివారు కూడా అనుభవించాల్సి వస్తుంది. దుష్టుని వెంట వెళ్లకూడదు, వుండకూడదు. అలా వుంటే పూర్వం కాకితో స్నేహం చేసిన హంసలా చెడిపోక తప్పదు" అంది

"ఆ కథ ఏంటి?" అని చిత్రపర్ణుడు అడిగాడు. అరుణముఖుడు చెప్పసాగాడు.



రియల్ స్టోరీ

శత్రువుపై యుద్ధం

ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకుంది.
వాతావరణం ప్రశాంతంగాఉంది.
ఉండి ఉండి వీస్తున్న చల్లటిగాలి శరీరానికితగిలి హాయిని కలిగిస్తోంది.
వర్షం కురుస్తుందేమో అనిపిస్తున్నప్పటికీ గాలికి మేఘాలు చెదిరిపోతున్నాయి.
గుజరాత్‌లో ఆనంద్ పట్టణంలో దినవారీ వీధి.

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

వ్యాపార వ్యవహారాలు ఎక్కువగా జరిగే ఆ ప్రాంతంలో అమ్మకందారులు, కొనుగోలుదారుల అరుపులు గోలగోలగా వినిపిస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి సరుకులు కొనుగోలు నిమిత్తం వచ్చినవారు హడావుడిగా తిరుగుతున్నారు.

సాయంత్రం ఆరు కావడంతో ఎండవేడిమి తగ్గి వెలుగురేకలు మాయమైపోతున్నాయి.

గాజులకొట్టు పక్క సందులోంచి వెళితే ఎత్తుగా ఉన్న మేడ ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా ఉంది. మేడపైభాగంలో కూర్చుని వచ్చేపోయేవారిని చూస్తోంది స్నేహల్ ఠక్కర్.

ఆమె మనసు ఎంతో ఆనందంగా ఉంది.

ఉదయం జరిగిన సంఘటన మదిలో మెదులుతూ గుర్తుకు వస్తుంటే ఆనందంతో పులకరింతలు కలిగిస్తోంది.

పదిహేడు సంవత్సరాల చిన్న వయసులో ఆమె పొందిన ఆనందాన్ని వర్ణించడానికి మాటలు సరిపోలేదు. గుజరాత్ నుంచి వెలువడే సాయంకాల దినపత్రికల్లో వార్త ప్రచురించడంతో చాలా మంది అభినందనలు కురిపించారు. ఉదయం జరిగిన సంఘటన గూర్చి స్నేహితులు, తల్లిదండ్రులు అడిగి మరీ తెలుసుకున్నారు. ఒకొక్కరికి విషయాన్ని చెబుతున్న ప్రతిసారీ ఠక్కర్‌కు ఒకలాంటి గర్వం కలుగుతోంది.

ఉదయం జరిగిన సంఘటన స్నేహల్ ఠక్కర్ మనో ఫలకంపై చెరగని ముద్ర వేసింది.

* * *

గుజరాత్ రాష్ట్రంలో ఆనంద్ పట్టణం ఒక ప్రత్యేకత సంతరించుకొని ఉంది. ఆనందబాయి హైస్కూలు ఆ పట్టణంలో ఎంతో ప్రసిద్ధి పొందింది. అక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతో మంచి ఉద్యోగాలను కూడా సంపాదించారు.

భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాబడ్డ అబ్దుల్‌కలాం గుజరాత్‌లో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్' సంస్థలో ప్రసంగించడానికి ప్రత్యేకంగా ఆహ్వానించబడ్డారు. ఆయన రాకకోసం సంస్థ అందంగా ముస్తాబైంది. స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు.

కలాం కార్యక్రమం అనుకున్నవిధంగా ప్రారంభమై పూర్తయిపోయింది. అధికార యంత్రాంగం అంతా కలాంకు వీడ్కోలు పలకడానికి ముందుకు వచ్చారు.

"ఏదైనా పాఠశాలలో పిల్లల్ని కలుసుకోవాలి..." కలాం తన ఆకాంక్షను బైట పెట్టారు.

పిల్లలంటే అబ్దుల్ కలాంకు ఎంతో ఇష్టమన్న విషయం అందరికీ తెలుసు. సువిశాల భారతదేశానికి ప్రథమ పౌరునిగా గుర్తింపు పొందిన వ్యక్తి వ్యక్తపరచిన కోరిక క్షణాల్లో ఆచరణలోకి వచ్చింది.

ఆనంద్ పట్టణంలో ఆనందాలయ హైస్కూలును అధికారులు ఎంపిక చేశారు. కలాం రానున్నారన్న విషయాన్ని క్షణాల్లో సమాచారం అందజేశారు. ముందుగా ఉన్నత స్థాయి అధికార బృందం అక్కడికి చేరుకుని కలాంతో సమావేశం గూర్చి విద్యార్థులకు బ్రీఫింగ్ ఇచ్చారు.

కలాం కళాశాల ప్రాంగణంలో అడుగుపెట్టారు.

తరగతి గదుల్లోంచి పిల్లలు వచ్చి వరుసగా ఆయనకు నమస్కారాలు చేశారు. కొంతమంది పిల్లల తలలపై చేతులు ఉంచి ఆశీర్వచనాలు అందించారు.

తర్వాత ఇంటర్‌మీడియేట్ పిల్లలతో సమావేశమయ్యారు. రాష్ట్రపతితో సమావేశం వారిలో ఎంతో ఉద్విగ్నత కలిగించింది. ముఖ్యంగా టీనేజ్‌లో ఉన్న అమ్మాయిలంతా కలాం చుట్టు చేరారు.

"నీ పేరేమిటి... నీకు ఏమి ఇష్టం... చదువు పూర్తయిన తర్వాత ఏమి ఉద్యోగం చేస్తావు. దేశానికి ఏమి చేయగలవు.. వీణ వాయించడం వచ్చా, మిస్సైల్స్ ఎలా ప్రయోగిస్తారు. భగవద్గీత చదివావా" వంటి రకరకాల ప్రశ్నలను ఆయన అడిగారు. పిల్లలంతా ఉత్సాహంగా జవాబులు చెప్పారు. తాము చెప్పిన జవాబులకు కలాం సంతృప్తి చెందినట్లు భావించారు.

ఆ సమయంలో స్నేహల్ ఠక్కర్ నోరు తెరిచింది.

ఆ అమ్మాయి తనను ఏదో అడగాలని అనుకుంటుందని గ్రహించి – "ఏమిటి?" అంటూ ప్రశ్నించారు.

"సార్! మన శత్రువు ఎవరు?" కలాంను టక్కర్ ప్రశ్నించింది. ఆయన నుంచి ఏం సమాధానం వస్తుందా అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తుండగా కలాం చిన్నగా నవ్వారు. తర్వాత– "ఈ ప్రశ్నకు నేను జవాబు చెప్పేకన్నా మీరు చెబితేనే బాగుంటుంది. అవును మన శత్రువు ఎవరు?" ఎదురు ప్రశ్నించారు.

పాకిస్తాన్... బంగ్లాదేశ్... చైనా... అమెరికా... అంటూ బాలికలు రకరకాల సమాధానాలు చెప్పారు. కాని స్నేహల్ ఠక్కర్ మాత్రం "పేదరికం... నిరుద్యోగం మన శత్రువులు" అంది. ఆమె జవాబు కలాంకి ఎంతో ఆనందాన్ని కలిగించింది. "సెభాష్" అంటూ అభినందించారు. "అవును మన దేశానికి పేదరికమే ప్రధాన శత్రువు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా మనందరం కలసికట్టుగా పోరాడాలి...' అన్నారు. తర్వాత మరో అరగంటకు ఆయన ఆనందాలయ హైస్కూలు నుంచి వెళ్ళిపోయారు. టక్కర్ వివరాలను, చిరునామాను నమోదు చేసుకోమని తన కార్యదర్శిని కోరారు.

* * *

"చీకటి పడింది.... కిందకి దిగవా!" తల్లి ధీర మేడపైకి వచ్చి కూతుర్ని పిలిచింది.

స్నేహల్ ఠక్కర్ ఉలిక్కిపడింది.

"అమ్మా! ఈ రోజు ఎంతో సంతోషంగా ఉందమ్మా! కలాం సాబ్‌తో మాట్లాడిన మాటలే మనసులో మెదులుతున్నాయి. ఏ పనీ చేయాలనిపించడం లేదు. బయాలజీ పుస్తకం తెరిచినా తలకి ఎక్కడం లేదు.

అందుకే మేడపైన కూర్చుని వచ్చేపోయే వారిని చూస్తున్నాను" స్నేహల్ చెప్పింది.

కూతురు మనసులో ఉద్విగ్నతను ధీర గుర్తించింది.

"ఈరోజు హైస్కూల్లో రాష్ట్రపతి నిన్ను మెచ్చుకున్న విషయం ఇతరుల ద్వారా వింటుంటే మరింత ఆనందం నాకూ కలుగు తోంది..." కూతుర్ని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకుంది.

స్నేహల్ కళ్లల్లో ఆనందంతో తడిచేరింది.

❋ ❋ ❋

స్నేహల్ ఠక్కర్ మొదటిసారి పొందిన ఆనందానికి రెట్టింపు ఆనందం మరో రెండు నెలలకు స్వయంగా అనుభవంలోకి వచ్చింది.

స్నేహల్ ఠక్కర్‌కు రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు వచ్చింది. 2002 సెప్టెంబర్‌లో ఈ సమాచారం పాఠశాలకు అందింది.

ప్రభుత్వపరంగా ఆహ్వానం.

గుజరాత్‌లో ఆనంద్ నుంచి ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ వరకు రానుపోను ఉచిత ప్రయాణ టిక్కెట్లు.. ఆమెకు సహాయకులుగా ఇద్దరికి కూడా అటువంటి అవకాశమే కల్పిస్తూ సమాచారం అందింది.

జిల్లా కలెక్టర్ ఈ లేఖలను స్నేహల్‌కి అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ గుర్తుతో వచ్చిన అధికారిక పత్రాలు చూసిన తర్వాత ఆమె ఆనందం శిఖరాల అంచులకు చేరినట్లయింది.

ఢిల్లీ బయలు దేరింది.

రాష్ట్రపతి భవన్‌లో అధికారులు ఆమెను ప్రత్యేకంగా గుర్తించారు. రాష్ట్రపతిగా ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్యక్షంగా చూడటానికి కొద్దిమంది ప్రముఖులకు మాత్రమే కలుగుతుంది. ఆ ప్రముఖుల్లో స్నేహల్ వుండటం ఆమెకు గొప్ప ప్రత్యేకతను సంతరించి పెట్టింది.

రాష్ట్రపతి అందరినీ కలుసుకున్న సమయంలో స్నేహల్ తన స్కూలు పేరును చెప్పింది. ఆ పేరు వినగానే ఆయన గుర్తించి 'నా ఫ్రెండ్ ఎక్కడ?' అంటు వాకబు చేశారు. "స్నేహల్ ఠక్కర్ ఈమె" ఆనందాలయ స్కూలు టీచర్లు పరిచయం చేశారు.

కలాం అభినందించారు.

"ఇగ్నైటెడ్ మైండ్స్! పుస్తకం రైటప్ ఈమె" అంటూ ఆయన మరో కితాబు ఇచ్చారు.

స్నేహల్‌కు నోట మాట రాలేదు.

"అవునమ్మా! నీ స్ఫూర్తితోనే ఆ పుస్తకాన్ని రచించాను. ఆ పుస్తకంలో ఉన్న విషయాలన్నీ నీకూ నాకూ ఆనందం కలిగించేవే... అందుకే దానికి కారణమైన నీకు ఆ పుస్తకం అంకితం..." అన్నారు.

తర్వాత ముందుకు సాగిపోయారు.

రాష్ట్రపతి కార్యాలయ అధికారులు ఆ పుస్తకం కాపీని స్నేహల్ ఠక్కర్‌కు బహూకరించారు. పేజీలను తిరగవేస్తూ అంకితం అన్న చోట తన పేరు చూసుకుని ఉండిపోయింది. "నేనేంటి... నాకింతటి పేరేంటి?" అన్న రీతిలో మనసు పరిపరి విధాలుగా పోయింది.

ఆ తర్వాత అశోక్‌హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ పుస్తకం ప్రతిని అందుకున్నప్పుడు స్నేహల్ చేతులు వణికాయి. దేశానికి అత్యున్నత ప్రథమ పౌరుడు, దేశంలో ఓ సామాన్య పాఠశాల విద్యార్థినైన తనను గుర్తించడం ఆమె మనసు ఆనందంతో పరవళ్లు తొక్కింది.

ఆమె నోట్లో మాటలు కరువయ్యాయి.

మనసు మూగబోయింది.

కళ్లల్లో కృతజ్ఞతా కెరటాలు ఉబికి ఉబికి వచ్చాయి.

❋ ❋ ❋

ఆమె మనసు ఆనందంతో ప్రశాంతంగా నిర్మలంగా ఉంది. రాష్ట్రపతితో ప్రశంస పొందడం, ఆయన రాసిన పుస్తకం తనకు అంకితం ఇవ్వడం.. అరుదైన సంఘటనగా ప్రమాణస్వీకారానికి తనకు ఆహ్వానం రావడం వంటి ఒక్కొక్క సంఘటన ఆమెలో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి.

ఆకాశంలో పక్షులు గుంపులుగా ఎగురుతున్నాయి.

మనసులో ఆలోచనలు కూడా విహరిస్తున్నాయి.

ఇంతలో తల్లి ధీర మేడపైకి వచ్చింది.

తల్లిని చూసిన తర్వాత ఆమెలో ఉద్విగ్నత మరింత ఎక్కువ అయింది.

"స్నేహల్! రాష్ట్రపతితో ప్రశంస పొందిన నువ్వు మన కుటుంబానికే కాదు. ఎంతోమందికి గర్వకారణంగా మారావు. నువ్వు చెప్పిన పేదరికం, నిరుద్యోగం అన్నవి మన శత్రువులు అన్న విషయం అందరూ గుర్తించాలి... ఇందుకు అనుగుణంగా నువ్వు కృషి చేయాలి..." అంది.

స్నేహల్ ఏమీ మాట్లాడలేదు. రెండు నిమిషాల తర్వాత- "అమ్మా! నువ్వూ నాన్నా ఇచ్చిన ఉత్సాహం.., చేయూతగా కల్పించిన ప్రోత్సాహం మరిచిపోలేను. ప్రతి విద్యార్థికీ, విద్యార్థి దశలో ఇటువంటి అవకాశం లభించినట్లయితే ఎటువంటి అభివృద్ధిని అయినా సాధించవచ్చు.... మీ స్ఫూర్తితో మున్ముందుకు సాగిపోవడానికి ఎప్పుడూ కృషి చేస్తాను.." స్నేహల్ చెప్పింది.

"ఢిల్లీ నుంచి వచ్చినప్పటి నుంచి నీకు రెస్టు అన్నది లేదు... మంచి టీ తీసుకువస్తాను..." అంటూ కిందికి వెళ్ళింది.

వాతావరణం ప్రశాంతంగా ఉంది... స్నేహల్ ఠక్కర్ మనసు లాగే...ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకుంది. ✥

తెలుగువేణి కృష్ణవేణి

(7వ పేజీ తరువాయి)

రాజప్రముఖుడొకరు వారిద్దరి తలలు నరికివేశాడు. వారి మొండెములు కృష్ణానదిలో కలసిపోయాయి. నది వారిద్దరి పేర్లను కలుపుకుని అప్పటినుంచి 'కృష్ణవేణి'గా ప్రసిద్ధి చెందిందట. జానపద గాథగా జానపదుల నోళ్ళలో అక్కడక్కడా వినవస్తున్న కథ.

పుష్కరాలు ఎప్పుడొస్తాయి?

సౌర కుటుంబంలో అతిపెద్దదైన 'గురు' గ్రహాన్ని భారతీయులు 'బృహస్పతి' అంటున్నారు. ఈ గ్రహం తన సంచారంలో వివిధ రాశుల మీదుగా యాత్ర ప్రారంభించడంతో పుష్కరాలు ప్రారంభమవుతాయి. గురు గ్రహం సూర్యుడి నుంచి ఐదవ గ్రహం. ఇది తన కక్ష్యలో తిరుగుతూ ఒక్కొక్క నక్షత్ర రాశిలో సంవత్సర కాలం పరిభ్రమిస్తుంది. ప్రస్తుతం గురుగ్రహం ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీ రాత్రి 8 గంటల సమయం నుండి ఒక ఏడాదిపాటు కన్యారాశిలో ఉంటుంది. కన్యారాశిలోకి గురుగ్రహం ప్రవేశించిన క్షణాల నుంచి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇవి 12 రోజులు జరుగుతాయి.

పుష్కర వైభవ పటాటోపం కొన్నిచోట్లే ఎందుకని...

పౌరాణిక, సాంప్రదాయ, ఆధ్యాత్మిక అవగాహన ప్రకారం కృష్ణానది అంతటికీ పుష్కరాలు వర్తిస్తుంది. కాబట్టి ఎక్కడస్నానం చేసినా, ఏ ఒడ్డున కర్మక్రతువులు, పూజాదికాలు నిర్వర్తించినా పుష్కర సమయప్రయోజనం సిద్ధిస్తుంది. కానీ ప్రజలు ఒక సందర్భాన్ని పురస్కరించుకుని ఒకచోట జాతరగా, సంబరంగా, ఉత్సవంగా గుమికూడి కలుసుకోవడాన్ని హర్షిస్తారు. కోరుకుంటారు. అందుకు అనువుగా ఉండే ప్రయాణసౌకర్యాలు, దేవాలయాల ప్రశస్థి ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటారు. దీనికి మరో కోణంలో వ్యాపార, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలను ఒనగూర్చుకునేవర్గాలూ లేకపోలేదు. గత గోదావరి పుష్కరాలను చంద్రబాబునాయుడుగారు తన ఎన్నికల ప్రచారానికి ఉపయోగపెట్టుకోజూసినంతగా ఏ పాలకుడూ చేసివుండడు. ✥

తావీజ్మహిమ!

లక్ష్మి

అనేకనేక పద్ధతుల్లో జోస్యం చెబుతుంటారు!

అంబ పలుకు జగదాంబ పలకమని అంబని పిలుస్తారు!

ఆ తర్వాత వినిపించే పలుకులన్నీ అంబ పలుకులేనని గట్టిగా నమ్మిస్తారు

చేతిలో రేఖల్ని చూసి భూమ్మీద జరగబోయే మన చరిత్ర చెబుతారు!

చిలకని పిలిచి కార్డు ముక్క చిలకముక్కుతో లాగిస్తారు!

ఆ కార్డులో రాసిన అక్షరాల ప్రకారం తూ.చ.తప్పకుండా మన భవిష్యత్తు నడుస్తుదంటారు!

ఇట్లా అనేకానకమైన ఫీట్లు ద్వారా మనముందరున్న బతుకు యొక్క బాగోగులు సెలవిస్తుంటారు. ఈ గందరగోళం ఎంత వరకు నిజమో వదిలేయండి. కొందరు మిడతం భొట్లకు ఈ విద్య జీవనాధారంగా వుంటోంది!

ముందరేం జరుగుతుందో –

మునుముందే తెలుసుకోవాలను కోడం మంచి పద్ధతికాదు!

జరగవలసింది జరుగుతుంది. ఆ వివరం అద్వాన్నుగా తెలుసుకోవాలనే కోరిక ఆరోగ్యానికి మంచిది కాదు!

బతికినంత కాలం సుఖసంతోషాలతో బతుకుతామనే గ్యారంటీ లేదుగదా! ఒకవేళ బతుకు మొత్తం ఆ విధంగా గడిచిపోతే అంతకంటే ఆనందమేముంది?

ఆ వివరాలు ముందుగా తెలుసుకుని మురిసిపోవడంలో థ్రిల్లేముంటుంది? ముగింపు ముందే తెలిసిన కథ మాదిరి నీరసంగా వుంటుంది! అవునా?

ఖర్మ కాలిపోయి –

రాబోయే ఆరునెలల కాలంలో గొప్ప ఆపద వేచి చూస్తోందని ముందే జోస్యం చెబితే – ఆ దిక్కుమాలిన ఆపద ఏ విధంగా అంటు కుంటుందో అనే బెంగతో మంచమెక్కుతాం!

సదరు ఆర్నెల్ల గడువూ మంచమ్మీదే గడిపేస్తాం!

ఆ సీజన్లో –

మంచం దిగాలనిపించదు. ధైర్యంచేసి మంచందిగినా వీధిలోకి వెళ్లాలనిపించదు. మన వీధిలో రవుడీ లారీలు అధిక సంఖ్యలో బిజీగా నడుస్తుంటాయి. వాటితోపాటు కార్లూ స్కూటర్లూ మోటారు సైకిళ్లూ అనేకం తిరుగుతుంటాయి. ఆ వాహనాల్లో ఏ ఒక్కటైనా సజావుగా నడవకపోతే మన జాతకం ప్రకారం మన చిరునామా చిరిగిపోతుందని భయ పడుతాం!

అంచేత –

రాబోయే ఆర్నెల్ల పిరియడ్లో మంచాన్ని వదిలిపెట్టకూడదని శరతు పెట్టుకుంటాం!

మన పిచ్చిగానీ –

మనకి రాసిపెట్టిన ఆపద మన మంచమ్మీదే పలకరించవచ్చని అప్పుడప్పుడూ అనుకుంటాం. మననెత్తి మీద తిరుగుతున్న ఫేను మెకానికల్ వైఫల్యంవల్ల – ఊడిపోయి మన తలను పదహారు ముక్కలు చేయవచ్చనే బెంగ మనల్ని స్థిమితంగా వుంచదు!

వంటగదిలో గేసు స్టవ్ మీదా...అక్కడ సిలిండర్ల మీదా అస్తమానం అపనమ్మకం పెట్టుకోవడం మూలంగా భయంకరమైన ఆలోచనలు దృశ్య రూపంలో మెదడ్ని పాడు చేస్తుంటాయి!

ఇంట్లో ఏ చిన్న శబ్దమైనా 'ఏమిటది' అని ఆర్తనాదం చేస్తాం!

మనకి జలుబుచేస్తే ఇదేదో మాయదారి రోగమని వణికిపోతాం! ఆర్నెల్ల గడువుకిది ఆదివాక్యమని అదిరిపోతాం! వెయ్యేల – ఎవడో చెప్పిన ఆపద జోస్యం నిజమవుతుందనే భయం పట్టుకుంటే నిబ్బరంగా బతకలేం. ఆ భయమే ఒక ఆపదగా భావించాలి!

కంటిక్కనిపించని ఆపద మనిషిని కుళ్లబొడుస్తుంది!

యమ యాతన పెడుతుంది. తిండి సయించదు. నిద్రపట్టదు. ఏమి కానున్నదో కదాని దిగులు పడతారు. నీకేం ఫర్లేదని ఎవరెన్ని అభయహస్తములిచ్చినా మనసులో శంక దూరం కాదు!

వాళ్ల ఓదార్పుకి పిచ్చినవ్వు పెదలమీద తెచ్చి పెట్టుకుంటారు. ఈ వాతావరణంలోనే ఆర్నెల్లూ గడుపుతారు!

ఆర్నెల్ల తర్వాత –

తనకి చెప్పిన జోస్యం తప్పని తెలిసిపోతే గాలి పీల్చుకుంటారు. గండం తప్పిందనుకుంటారే తప్ప చిలకజోస్యం తప్పిందని చెప్పరు!

ఇదేదో 'ఊసుపోకరాస్తున్న గేసని తీసిపారేయకండి!

ఆవిడగారు మాకు దూరబ్బంధువు... వివరాలడక్కండి. అవి గుట్టుగా వుండటమే మంచిది. అల్లరైతే నన్ను ఆడిపోసుకుంటారు!

ఆవిడ ఆషామాషీ మనిషి కాదు!

బాగా చదువుకున్నారు. ప్రభుత్వోద్యోగంలో గెజిటెడ్ హోదాలో రిటైరై ప్రస్తుతం ఇంటి పట్టునే వుంటున్నారు!

ఆ ఇల్లు –

సిరిగల ఇల్లు. కొడుకులూ కోడళ్లూ మనవాళ్లతో కళకళలాడుతూ వుంటుంది. ఆవిడకు జాతకాలూ జోస్యాలమీద వల్లమాలిన గురి. తన జాతకం ప్రకారమే తన జీవితం నడుస్తోందని చెప్పుకుంటారు!

కొన్నాళ్ల క్రితం –

చుట్టం చూపుగా ఆ యింటికి వెళ్లాను. ఆ వేళకి –ఎవరో కోయదొర ఆమెకు జోస్యం చెబుతున్నాడు. అతని మాటలు ఆవిడ ఎంతో శ్రద్ధగా వింటోంది. అంతే శ్రద్ధగా రియాక్టవుతోంది!

వారమంటే వారం రోజుల్లో ఆవిడకు ప్రాణగండముందని కోయదొర చెప్పేడు. ఆ గండం తొలిగిపోయే మార్గం లేదా అని ఆవిడ ఆందోళనగా అడిగేరు!

కోయదొర గడ్డం మీసాలూ నిమురుకుంటూ – శ్రీరాములు వారు దయగల దొర అన్నాడు. తావీజిస్తాను దగ్గిరపెట్టుకోండన్నారు!

మహాప్రసాదం అంటో ఆ తావీజు తీసుకుని కళ్లకద్దుకుని నూట పదహార్లిచ్చి కోయదొరని పంపించేసేరు!

ఆ తర్వాత –

ఆ యింటికి కోయదొరల రద్దీ పెరిగిపోయింది. ఇప్పటికీ ఆ వరన కొనసాగుతూనేవుంది !

◆

"విచారం-విచారణలు"

రుక్మిణి

మల్లన్న మండిపడుతున్నాడు. నిప్పులు చెరుగుతున్నాడు. మల్లన్న ముఖ్య అనుచరుడు నాగిరెడ్డి కూడా దాంట్లోకి ఎగబడుతుండు. రావిచెట్టు చప్టా మీద పదిమంది దనకా వూరిపెద్దలు కూకుండి ఇవరాలు... సంగతులు అడుగుతండ్రు. మల్లన్న ఒక అయిదేండ్లుగా వూరి సర్పంచుగిరీ ఎలగబెట్టిండు. కాలం కరమం కలసిరాక మొన్నటి ఎలక్షన్లలో డిపాజిటు కూడా పోగొట్టుకుండు.

"అరె గంత కోపమేందె మల్లన్న... జరసైసు! మేం ఏందడిగినా తప్పులు బడ్తవ్! గదికాదే.. యివరం అడిగితే ఎగురుడేంది? సల్లంగ జవాబు చప్పరాదే! కొత్తగా ఎలక్షన్ల గెలిచిన తిరపతి నిమ్మలంగానే అన్నాడు.

"అడుగుండ్రి..నాకేం భయం! అయిదేండ్లు తెరిచుంచిన కితాబోలిగ చేసిన... ఇంగమీరు పగులతీసేదేందో జరచెప్పండ్రి. పుణ్యానికి మాటలు చెప్పి కోతలు కొయ్యంగనే నిబద్ధయితాది...జనాలు అంతా చూస్తండ్రు!" మల్లన్న తొడలు చరిచాడు. నాగిరెడ్డి ఘీంకరించాడు. యాద్గిరికి ఒళ్ళు మండిపోయింది.

"గదికాదే మల్లన్న...బంగారమసుంటి మన గ్రామ పంచాయతి భూమి మన మార్కెటులోనున్నది. గది దాన్ని గాడెవడో 'వైనుషాపు'-'డాబావోటలు' పెట్టుకుంట నంటే...వెయ్యిగజాలు...వామ్మో...రూపాయకు గజం చొప్పున కట్టబెట్టినవే! వాడు దర్జాగా దాన్లో దుక్నాలు కట్టుకుండు!"

"గదే..గది పంచాయతీ తీర్మానం చేసి వాడికిచ్చినం! ముప్పయ్యేండ్ల అగ్రిమెంటు -సంవత్సరానికి పన్ను కింది వందరూపాయలు పంచాయతికి ఆదాయం వచ్చే రూటు చేసిన! మన గ్రామం అభివృద్ధికిగా పైసలు బాగ అవుసరం... తీర్మానం..."

"ఆగసె....లచ్చ...లచ్చ రూపాయల విలువైన భూమి.. పోటీపెట్టి పాటపాడితే మరెక్కువే వచ్చేది. అయినా పేదోళ్ళకు దుకాణాలు కట్టి కిరాయికిస్తే పది కుటుంబాలు బతికేటివి."

"అరె...అక్కడ బ్రాండీ దుకనం...డాబా వోటలుంటేగా మార్కెట్లో బాగా గిరాకీ పెరిగి యాపారంలో బోలెడు లాభం. అయినా అభివృద్ధి గురించి మీకేం తెలుసు. అది "అక్రమం" అని మీరనుకుంటే నేనేం చేసేది!"

"ఆ దుకాణంలో మీకూ...మీ వార్డు మెంబర్లకూ ముడుపులు ముట్టినయి" గయ్యిమని జక్కులోడు...మల్లేశం...జనాలు బొబ్బలు పెట్టిండ్రు. మల్లన్న ఆవేశంతో వూగిపోయిండు. "అబద్ధం-కావాల్నంటే పైకి రిపోర్టు చేసుకుని డిఎల్పీవోతో జరిపిచ్చుకోండి" అని రంకెలు వేసిండు.

"సరె..ఆ పనే చేస్తం!" తిరపతయ్య తాపీగా అన్నడు. "మన చెరువు కింద శిఖం భూమి వందెకరాలు. దాంట్లె మన గొల్లోళ్లు.. పేదరైతులు పశువుల్ని మేపుకోడానికి వదిలిపెట్టిన బంజరుభూమి...దాన్ని వాడెవడో మానుకోట సావుకారికి పిండిగిర్ని...వడ్లమర పెట్టుకోడానికి పుణ్యానికీ [illegible]



సర్కారు భూములన్నిటినీ...ఎవనికిబడితే వానికి, ఎంతకుబడితే అంతకు అమ్మపారనూకితే ఎట్లా...?"

మల్లన్న మహోవుగ్రుడై 'ఎంక్వైరీ' చేసుకొమ్మని ఘీంకరించిండు. నాగిరెడ్డి తిరుపతయ్య మీద ఎగిరెగిరి పడ్డడు.

"నాగిరెడ్డిగారు...మీ వార్డు జనాల కంట్రోలు బియ్యం దొంగ కూపన్లు నూకి రెండు లారీలు మిల్లుకు తోల్తంటే పోలీసులు పట్టుకున్నారు. కేసు రాసిండ్రు" జక్కులోడి మాటలను మధ్యలోనే తుంచి నాగిరెడ్డి "అబద్ధం" గవి బియ్యం కావు...వడ్లగింజలు... మా చిన్నల్లుడు పెద్దమిల్లులో బియ్యం పట్టిచ్చడానికి లారీలల్ల తోలకపోతంటే మీరే అడ్డంపడి దొంగ కేసు బనాయించిండ్రు. అయినా అది తేలిపోయింది గద!"

"ఏం తేలింది - వేం దానిమీద యస్పీ...సర్కిలు..డిజీ. అందరికీ రిపోర్టులు చేసి కేసును బయటకు గుంజి గవి బియ్యమో..ధాన్యమో తేల్చుకుంటంగద".

నాగిరెడ్డి దిగ్గున గెంతి బూతులకు లంకించుకున్నాడు - మనిషి అగ్గిమీద గుగ్గిలం అయిపోతండు - తిరపతయ్యనూ.. జక్కులోడ్ని..వాళ్ళ ఇండ్లల్లో జరిగిన పెండ్లాం మొగళ్ళ కీచులాటలు.. తండ్రి కొడుకుల మధ్యన జరిగిన చిల్లర కీచులాటలను పెడబొబ్బలతో అందరి మధ్యకు తెచ్చి వూరికే అరవడంతో నిజంగానే అందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

"అదేంది రెడ్డీ.... జనాల సంగతి.. 'పంచాయతీ' యవ్వారాలు మేం అడుగుతుంటే నువ్ కూరా - బువ్వల సంగతి తెస్తున్నవ్! గద్సరే.. వెన్నారం కంట్రక్టరు నీకు మూడులచ్చలు...గా గార్ల సేటు నుండి ఇప్పించిండట ! నువు తీసుకున్నవట.. ఇగో.. వెన్నారం కంట్రాక్టరు గార్ల సేటుకు రాసిన ఉత్తరం - దీంట్లె 'పెదబాబుకు మూడులచ్చలివ్వవలసింది' అని రాసిండు..." తిరపతయ్య ఒక ఉత్తరం తీసి చూపిచ్చిండు.

"గది మీకెట్ల దొరికింది?" నాగిరెడ్డి అధాటున అని తటాల్న నాలిక కొరుక్కున్నాడు. "అది దొంగ వుత్తరం - అసలు నాకు వెన్నారం కంట్రాక్టరెవడో తెలవదు!" మల్లన్న గర్జించాడు.

"వాడెవడో తెలవకుండానే గా మునేరు బ్రిడ్జి కాంట్రాక్టు కట్టబెట్టినవా?" జక్కులోడు క్రూరంగా అడిగిండు. మల్లన్న తత్తరపడ్డడు.. "చూడండ్రి - గది పోర్జరీ - కుట్ర - నాకేం తెలవదు - మీరు సి.ఐ.డిలను పెట్టి విచారణ జరిపిచ్చుకోండ్రి. ఏం చేస్తరో చేస్కోండి - అరె. అయిదేండ్లు నేను మనూరు బాగోగుల గురించి ఇంతా చేస్తే నామీద పగ సాధించటానికి గిన్ని అబద్ధాలు.. ఆరోపణలు.. గిన్ని విచారణలు.. నాకేం భయంలేదు - మీరు 'అభివృద్ధిని' పట్టిచ్చుకోకుండా నామీద 'పగ' తీర్చుకోడానికే తయారైతండ్రు - ఇది మంచి పద్ధతికాదు - రావయ్య - నాగిరెడ్డీ!" అని మల్లన్న గబగబ తన అనుచరులతో అక్కడ్నుండి దురుసుగా వెళ్ళిపోయిండు -

"గదికాదె అన్నా.. వాండ్లలోని అన్నింటిమీదా 'విచారణ' చేస్కొమ్మని గట్ల చెప్పినవ్. వద్దని ఎదిరిస్తె పోలా..." నాగిరెడ్డి అమాయకంగా అన్నడు.

"రెడ్డీ - వాండ్ల దగ్గర గట్లనే అనాలె - అన్నిట్లో విచారణలు జరిపిచ్చుకోమనాలె - బయట పబ్లికుదగ్గర 'వీండ్లు మనమీద ఇట్లా పనికిరాని విచారణలుపెట్టి పరువు తీస్తున్నార'ని ప్రచారం చెయ్యాలె. వాళ్ళు అబద్ధాలతో పగ సాధించుడు తప్ప వూరి 'అభివృద్ధి' గురించి అస్సలు పట్టిచ్చుకోడం లేదని వూదర పెట్టాలె - పాపం - ఎర్రి జనాలకు మనమీద గురి కుదుర్తది - మళ్ళీ వచ్చే ఎలక్షన్లలో వాండ్లు మనల్ని దయ చూడవచ్చు - అదీ అసలు రాజకీయం!"

నాగిరెడ్డి తన భారీ కాయాన్ని అటుఇటు వూపాడు. గొర్రెలా తలాడించాడు.

పచ్చకామెర్లు ఒక వ్యాధి లక్షణం మాత్రమే. దానికి అనేక కారణాలు ఉన్నాయి. పచ్చకామెర్ల (జాండిస్)ను కలిగించే వ్యాధుల్లో వైరస్ వల్ల వచ్చే 'హెపటైటిస్' ప్రధానమైనది. ఈ వైరస్‌లలో ఎ,బి,సి,డి,ఇ,జి - మొదలైన వాటిని వైద్య శాస్త్రజ్ఞులు గుర్తించారు. వీటిల్లో 'ఎ' వైరస్ వ్యాధి ముఖ్యంగా పిల్లల్లో 1 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సులో వస్తుంది. చాలా మందిలో 1 నుంచి 2 వారాల్లోనే ఈ వ్యాధి తగ్గిపోతుంది. త్రాగే నీరు, ఆహారం కలుషితం అవటం వల్ల ఈ వైరస్ వ్యాధి వస్తుంది.

వైరస్ వల్ల వచ్చే కామెర్ల వ్యాధి

డాక్టర్ పి.దక్షిణామూర్తి ఎం.డి.

వైరస్ "ఇ" వల్ల వచ్చే పచ్చకామెర్లు కూడా కలుషితమైన నీరు, ఆహారాల ద్వారానే వ్యాపి స్తుంది. మనదేశంలోను, ఇతర ఆగ్నేయాసియా దేశాల్లోను అప్పుడప్పుడు వేలాది మందిలో ఒకే సమయంలో వచ్చే 'ఎపిడిమిక్'లకు ఈ వైరస్ ప్రధాన కారణం. 1955 డిసెంబర్ నుండి 1956 జనవరి వరకు ఢిల్లీ నగరంలో 29వేల మందికి పైగా ప్రజలకు ఈ పచ్చకామెర్ల వ్యాధి సోకింది.రెండు వారాల వ్యవధిలోనే ఇంతమందికి సోకి ఆరు నుంచి ఏడు వారాల్లోగా వ్యాధి తగ్గుముఖం పట్టింది. 1955 అక్టోబర్‌లో అధికవర్షాల వల్ల యమునా నది వరదలకు గురై ఢిల్లీలోని పెక్కు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒక నీటి సరఫరా కేంద్రంలోని మంచినీరు కలుషితం కావటం వల్ల వేలాది మందికి ఈ వ్యాధి సోకింది.

ఈ వ్యాధిలో పచ్చకామెర్లు బయట పడక ముందు హఠాత్తుగా ఆకలి తగ్గిపోతుంది. అన్నం చూస్తేనే వాంతి వచ్చినట్లుంటుంది. కడుపు పైభాగంలో నొప్పి, వాంతులు ఉండవచ్చు. మూడు, నాలుగు రోజులు 102 డిగ్రీల వరకు జ్వరం ఉండవచ్చు. ఈ దశలో 'ఫ్లూ' మొదలైన జ్వరాల మాదిరి లక్షణాలే ఉంటాయి. మూత్రం, కళ్ళు పచ్చబడటం ప్రారంభం అవగానే, జ్వరం, వాంతులు క్రమేణా తగ్గి ఆకలి పెరుగుతుంది. వ్యాధి ప్రాథమిక దశలోనే రోగుల మూత్రం ద్వారా వైరస్ విసర్జించబడుతుంది.

ఈ వ్యాధి నివారణకు వ్యక్తిగత శుభ్రత అవసరం. కలరా, టైఫాయిడ్, అతిసార వ్యాధులవలె 'ఎ' 'ఇ' హెపటైటిస్ వ్యాధులు కూడా జలవ్యాపిత వ్యాధులే, రోగితో సన్నిహితంగా ఉండే వారంతా చేతులు సబ్బునీటితో శుభ్రంగా కడుక్కోవాలి. ఆహార పానీయాలు సేవించే ముందు కూడా చేతులు కడుక్కోవాలి. రోగి ఉపయోగించే పాత్రలు, గుడ్డలు ఇతరులు ఉపయోగించకూడదు. తాగే నీటిని 20 నిముషాల సేపు మరగకాచి చల్లార్చి తాగాలి. ప్రజలకు సరఫరా అయ్యే మంచినీటిని 'క్లోరినేషన్' చేస్తే చాలదు. బ్లీచింగ్ పౌడర్‌తో ప్రతిరోజూ ఒక నెలరోజులపాటు 'సూపర్ క్లోరినేషన్' కొనసాగిస్తే ఈ వ్యాధిని నిరోధించవచ్చు. పచ్చకామెర్ల వ్యాధి 'ఎపిడిమిక్'గా అనేక మందికి సోకుతున్నప్పుడు 'గామా గ్లోబ్యులిన్' ఇంజక్షన్లను స్కూళ్లలోను, శిబిరాల్లోనూ, సైనిక దళాల్లోనూ చేస్తే వ్యాధిని నివారించడానికి అవకాశం ఉన్నది. పసిపిల్లలకు, గర్భిణీ స్త్రీలకు కూడా ఈ ఇంజక్షన్‌లను ఇవ్వవచ్చు. అధిక వర్షాలు, వరదల సమయాల్లో నీటి పైపులు 'లీక్' కాకుండాను, మురుగు, చెత్త, చెదారాల వల్ల మంచినీరు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత మున్సిపల్ అధికారులపైన, ప్రభుత్వం పైన ఉన్నది. 'బి' వైరస్ వల్ల వచ్చే పచ్చకామెర్లు, 'ఎ' వైరస్ వల్ల వచ్చే దానికంటే తీవ్రంగా ఉంటాయి. 'బి' వైరస్‌ను రక్తంలో కలిగి ఉన్న వ్యక్తుల (కేరియర్స్) ద్వారా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. కేరియర్‌లుగా ఉన్న వ్యక్తుల రక్తాన్ని ఇతరులకు ఎక్కిస్తే పచ్చ కామెర్లు రావచ్చు. ముఖ్యంగా డబ్బు తీసుకుని తరచుగా రక్తదానం చేసే వ్యక్తుల నుంచి రక్తం స్వీకరించిన వారికి ఈ వ్యాధి సోకుతుంది. ఒక రేజర్‌ను అనేకమంది ఉపయోగించినా, చెవి పోగు కుట్టడానికి, పచ్చబొట్టు పొడవటానికి ఉపయోగించే సూదుల ద్వారాను, సరిగా స్టెరిలైజ్ చేయని సూదులను ఇంజక్షన్ చేయటానికి ఉపయోగిస్తే ఈ వ్యాధి రావచ్చు. మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడిన వారిలోనూ, తరచూ రక్తం ఎక్కించవలసిన 'హిమోఫిలియా' వంటి వ్యాధులు ఉన్న వారిలోను ఈ వ్యాధి రావచ్చు. బ్లడ్ బ్యాంకుల్లోను, డయాలసిస్ యూనిట్లలోను, హాస్పిటల్ లేబరేటరీల లోను పనిచేసే వారిలో ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నది. భార్యాభర్తలలో ఒకరి రక్తంలో ఈ వైరస్ ఉంటే, రెండవ వారికి వస్తుంది. 'బి' వైరస్ కేరియర్ అయిన తల్లికి పుట్టే శిశువుకు కూడా ఈ వైరస్ వ్యాధి సంక్రమించే అవకాశం ఉన్నది.

'బి' వైరస్ వ్యాధి వచ్చిన వారిలో నూటికి ఐదు నుంచి 10 మంది రక్తంలో ఈ వైరస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటుంది. వీరినే 'కేరియర్లు' అంటారు. వీరిలో కొంతమంది పచ్చకామెర్ల వంటి లక్షణాలేమీ లేకుండా ఆరోగ్యవంతుల్లాగా తిరుగుతూ ఉండవచ్చు. 'బి' వైరస్ పచ్చకామెర్ల వ్యాధి తగు చికిత్సతో కొద్ది వారాల నుండి కొద్ది నెలల్లో తగ్గుముఖం పడుతుంది. కొద్దిమందిలో ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం బాధిస్తుంది మరికొద్ది మందిలో జలోదరం (లివర్ సిర్రోసిస్), లివర్ కేన్సర్ వ్యాధులకు దారితీయవచ్చు. 1989లో కనిపెట్టబడిన 'సి' వైరస్ రక్తం ఎక్కించటం ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. రక్తం ఎక్కించిన రెండు వారాల కంటే ముందే సోకే ఈ వ్యాధిలో కామెర్ల తీవ్రత కొద్దిగా తక్కువగా ఉంటుంది.



డెల్టా వైరస్ ('డి' వైరస్) తరచుగా 'బి' వైరస్‌తోపాటు రోగి రక్తంలోకి ప్రవేశిస్తుంది. ఇంకా 'జి' వైరస్ మొదలైన కొత్తకొత్త వైరస్‌లను వైద్య శాస్త్రజ్ఞులు కనిపెడుతూనే ఉన్నారు. భవిష్యత్తులో ఎక్స్,వై,జడ్ వరకు కూడా ఈ వైరస్‌ల జాబితా పొడిగింపబడితే ఆశ్చర్య పడనక్కరలేదు.

పచ్చకామెర్ల వ్యాధి చికిత్స – నివారణ

పచ్చ కామెర్ల వ్యాధి గురించి ప్రజల్లో చాలా అపోహలు ఉన్నాయి. ఈ వ్యాధిని నయం చేస్తామని కొంతమంది నాటు వైద్యులు పల్లెల్లో, పట్టణాల్లో కూడా అమాయక రోగులను నమ్మించి, వారి కళ్ళలో పసర్లు పోయటం, మణికట్టు మీద కాల్చడం వంటి వైద్యాలు చేస్తుంటారు. విద్యాగంధం లేని వారితో పాటు కొంతమంది విద్యావంతులు కూడా మూఢనమ్మకాలతో ఇలాంటి వైద్యాలు చేయించుకొంటున్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు.

రోగికి ఇచ్చే ఆహార విషయంలో కూడా ప్రజలకు చాలా అపోహలు ఉన్నాయి. వ్యాధి ప్రాథమిక దశలో ఆకలి లేనప్పుడు, వాంతులు అవుతున్నప్పుడు పాలు, మజ్జిగ, గ్లూకోజ్, పండ్లరసం మొదలైన వాటిని తీసుకోవచ్చు. అవసరమైతే గ్లూకోజ్ ఇంజక్షన్లను డాక్టర్ చేస్తారు.

ఆకలి పెరగగానే పూర్తిగా మామూలు ఆహారం తీసుకోవాలి. ఆకలి ఉన్నంత వరకు ఏ ఆహారమైనా తీసుకోవచ్చని లివర్ వ్యాధుల నిపుణులు సలహా ఇస్తున్నారు. మన గ్రామాల్లో ఈ వ్యాధి వచ్చిన వారికి ఒట్టి మజ్జిగ అన్నం పెట్టి మాడుస్తుంటారు. ఈ వ్యాధిలో కొవ్వు పదార్థాలు తినకూడదనే అవనమ్మకం చాలామందిలో ఉన్నది. సమగ్రమైన మామూలు ఆహారం తిన్నవారిలో వైరస్ వల్ల వచ్చే పచ్చకామెర్లు త్వరితంగా తగ్గుతాయని వైద్య శాస్త్రజ్ఞుల నిశ్చితాభిప్రాయం. పైత్యాశయంలోని రాళ్ళు మొదలైన ఇతర వ్యాధుల్లో వచ్చే కామెర్లలో కొవ్వు పదార్థాలు తగ్గించవలసి ఉంటుంది. కాబట్టి అన్ని రకాలైన పచ్చకామెర్ల వ్యాధుల్లోను ఒకే రకమైన వైద్యం, ఆహారం తీసుకోవాలనటం సరికాదు. క్వాలిఫైడ్ డాక్టర్ సలహానుసరించి మెలగటమే ముఖ్య కర్తవ్యం.

వైరస్ వల్ల వచ్చే పచ్చకామెర్ల వ్యాధిలో రోగి పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. పూర్తిగా కళ్ళలో పచ్చదనం తగ్గేవరకు, రక్తంలో 'బిలిరూబిన్' స్థాయి మామూలు స్థాయికి వచ్చే వరకు విశ్రాంతి అవసరం. [illegible] వారాల్లో [illegible] పచ్చకామెర్లు తీవ్రంగా వచ్చి శరీరానికి నీరు రావటం, అపస్మారక స్థితిలోకి పోవటం వంటి కాంప్లికేషన్లు రావచ్చు. ఇటువంటి వైపరీత్యాలు రాకముందే, ప్రాథమిక దశనుంచి తగు జాగ్రత్తలతో చికిత్స చేయించటం ముఖ్యం.



'బి' వైరస్ పచ్చ కామెర్లు రాకుండా అందరూ తగు జాగ్రత్తలను తీసుకోవాలి. 'డిస్పోజబుల్' సిరంజిలతో మాత్రమే ఇంజక్షన్లను చేయించుకోవాలి. రక్తం ఎక్కించవలసిన పరిస్థితి ఏర్పడినప్పుడు రక్తదాత రక్తాన్ని పరీక్ష చేయించి ఎటువంటి వైరస్ దోషం లేకపోతేనే ఆ రక్తాన్ని స్వీకరించాలి. డబ్బుకోసం రక్తాన్ని అమ్ముకునే 'వ్యాపార' రక్తదాతల నుంచి గాకుండా, బంధువుల నుంచి స్నేహితుల నుంచి దోషరహితమైన రక్తాన్ని స్వీకరించటం మంచిది.

తీవ్రమైన కాంప్లికేషన్లకు దారితీసే 'బి' వైరస్ పచ్చకామెర్ల వ్యాధి రాకుండా నిరోధించడానికి 'వ్యాక్సిన్' (ఎంజిరిక్స్-బి) ఇంజక్షన్ రూపంలో 1986 నుండి లభ్యం అవుతోంది. డాక్టర్లు బ్లడ్ బ్యాంకులు, లేబరేటరీలలో పనిచేసేవారు. డయాలసిస్ చేయించుకునేవారు, 'హిమోఫిలియా' వంటి వ్యాధులు ఉన్నవారు, మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడినవారు, ఈ పచ్చకామెర్ల వ్యాధి సోకిన వారున్న కుటుంబాలలోని ఇతర సభ్యులు ఈ వ్యాక్సిన్‌ను 1 సిసి చొప్పున మూడు డోసులు (మొదటి డోసు చేయించుకున్న నెల తరువాత రెండవ డోసు, ఆరు నెలల తరువాత మూడవడోసు) చేయించుకోవాలి. అవసరమైతే, డాక్టర్ సలహా ప్రకారం మూడు నుండి ఐదు సంవత్సరాల తరువాత రీవ్యాక్సినేషన్ చేయించుకోవాలి.

వందకవుల సంకలనం

'పాలమూరు కవిత'

వంద మంది పాలమూరు గడ్డపై పుట్టిన కవులు రచించిన కవితలను సేకరించిన భీంపల్లి శ్రీకాంత్ 'పాలమూరు కవిత' పేరుతో ఒక సంకలనాన్ని అచ్చువేయించారు. తెలంగాణా జిల్లాల్లోనే మహబూబ్‌నగర్ (పాలమూరు) అతిపెద్దజిల్లాగా పేరు గాంచింది. ఇక్కడ పుట్టిన కూలీలు వలస వెళ్లినట్లుగానే కవులు కూడా వృత్తిరీత్యా వివిధ జిల్లాలలో స్థిరపడ్డారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో మూడు వందలకు పైగా గుర్తింపు పొందిన కవులున్నారు. అజ్ఞాత కవులెందరో ఉన్నారని భీంపల్లి శ్రీకాంత్ పరిశోధనలో వెల్లడయింది. అందులో కేవలం వందమంది కవుల కవితలను మాత్రమే ఆయన సేకరించి ఒక సంకలనాన్ని అచ్చువేయించగలిగారు. కవుల కవితలతోపాటు వారి జీవిత విశేషాలను ఫొటోలతో ముద్రణకు నోచుకున్నాయి. జులై 25న ప్రముఖ కవి కపిలవాయి లింగమూర్తి ఈసంకలనాన్ని ఆవిష్కరించారు. ఈసంకలనంలో డాక్టర్ సి.యశోదారెడ్డి, డాక్టర్ ఎస్.వి.రామారావు, డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ కసిరెడ్డి, ఆచార్య వెల్దండ రఘుమన్న, డాక్టర్ మసన చెన్నప్ప, మంత్రివాది సుధాకర్‌రావు, ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి, డాక్టర్ రుక్నుద్దీన్, వల్లభాపురం జనార్దన, భీంపల్లి శ్రీకాంత్, బిజినేపల్లి లక్ష్మీకాంతగుప్త, జ్వాలాముఖి, పల్లెర్ల రాంమోహన్‌రావు, చందోజీరావు తదితర వందమంది కవుల కవితలు ఉన్నాయి. ఇందులో సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలతో కూడిన కవితలు ఉన్నాయి. జిల్లాలో తాండవిస్తున్న కరువు, వలసలు తదితర అంశాలను కవులు తమ కవితల్లో జోడించారు.

శాస్త్రం అలికిన పాలం నాదేశం
విద్దెలె నింపిన గాదె నాదేశం

నాదేశం- కవితలో ఆచార్య యశోదారెడ్డి పైవిధంగా చెప్పారు.

ఆకర్ణాంత నేత్రాలునీవి
ఆజాను బాహువులు నీవి
నీ ఎడద విశాలం
నీ కరుణ అపారం
నీకు ఏ ఉపాయమీయను ?
నేను నిరుపేదను .....

ఆర్తి- కవితలో ఎస్.వి.రామారావు అంటారు.

అసలైన ప్రజాస్వామ్య వాది
అనంతకాలం ఒక్కటే .
పేదవాడైనా పెన్నిదిగలవాడైనా
సమానంగా పంచే సంపద
రోజుకు ఇరవై నాలుగు గంటలే!

రక్తపుష్పాలు -కవితలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అంటారు.

మనం దూరమై పోతున్నాం
మనమధ్య మంచుతెరలు పడుతున్నాయి
అలలు అలలుగా సాగిసాగి
అరలు అరలుగా ఆగిఆగి
ఎవరికి వారం ఏకాంతంలోకి జారిపోతున్నాం...

మనం దూరమై పోతున్నాం - కవితలో ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి

పాలమూరు గడ్డమీద
మా అమ్మ పచ్చిపాల నురగంత స్వచ్ఛంగా కనుతెరిచింది కాని
అందరిలా పొత్తిళ్లలో కదలాడలేదు
ఉయ్యాల జంపాల ఊగలేదు
పదేళ్ళ వయస్సులో పెళ్లిపీట మీది కెక్కించారు
పీటలుదిగి అత్తవారింటికి తరలివెళ్లింది.....

మా అమ్మ- కవితలో డాక్టర్ జె.చెన్నయ్య అంటారు.

మెరిసే బట్టలు కట్టుకొనగానే సరిపోదు
మెప్పించే దిట్టతనం తెలిసుండాలి
చెట్టు కొట్టకొనకెక్కగానే సరిపోదు
గట్టిపట్టు అనేది తెలిసుండాలి
ఉన్నదిగదా! అని అస్తమానం తినగానే సరిపోదు
తిన్నది అరగించుకొనుట
తెలిసుండాలి

తెలిసుండాలి-కవితలో బిజినేపల్లి లక్ష్మీకాంతగుప్త గారంటారు.

పాలమూరు మాది
రెక్కాడితే డొక్కాడదది
డొక్కాడితే రెక్కాడదది
కాయకష్టంజేసే రెక్కలను
ముక్కలుముక్కలుగా చేసి
మా శరీరాన్ని హూనం చేసి
డ్యాములు కట్టినాము...

పాలమూరు కూలీలం- కవితలో డాక్టర్ బూర్గుల కేశవులు

ఇలా ఈ సంకలనంలో ఇప్పుడిప్పుడే కవితలు రాయడం మొదలు పెట్టిన వారి నుండి అనుభవం గడించిన కవులు ఈ పుస్తకంలో కవితలు రాసిన వారున్నారు. సమరచిత్రం, ఎండమావులు, ఆత్మహత్యలు, పాలమూరు లేబరు బతుకు , నేనూ ఓ సమిదనౌతా, నిశ్శబ్ద నిష్క్రమణం, దుఃఖం తదితర కవితలు అందరినీ ఆకట్టుకునేవిగా ఉన్నాయి. వందమంది కవులలో 12 మంది కవయిత్రులు కూడా ఉన్నారు. వారి కవితలు కూడా బాగున్నాయి. సమాజంలో పలుసమస్యలకు పరిష్కారాలు చూపేవిగా ఉన్నాయి. కవితలంటే కేవలం పద్య కవితలే కావు, వచన కవితలతో కూడా చక్కని పదప్రయోగం, చక్కటి భావాన్ని చెప్పవచ్చని ఈ వందకవితల సంకలనం రుజువు చేసింది.

- పానుగంటి చంద్రయ్య



పుస్తకం వెల: 100/-
సంపాదకులు :భీంపల్లి శ్రీకాంత్
ముద్రాపకులు : పాలమూరు సాహితీ
ఇంటినెంబర్: 8-5-56, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్ -509001
ఫోన్ నెంబర్: 08542-270563

స్వీకారం



శ్రీపాద ప్రస్థానం
రచన : పి.ఆర్. మహేందర్ రెడ్డి
వెల : రూ. 100/-; ప్రతులకు :విశాలాంధ్ర బుక్ హౌజ్, అన్ని బ్రాంచీలలో దొరుకును.

జ్వాలగా జీవించాలని
రచయత : డా॥ సి. నారాయణ రెడ్డి;
వెల : రూ. 100/-; ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌజ్ లలో దొరుకును

ఎగిసిపడే జలగీతం ఎత్తిపోతల జలపాతం

సహజమైన ప్రకృతి శోభలనడుమ కృష్ణా పుష్కరాల సందర్భంగా మరింత కనువిందు చేసే జలధార సాగర్ ఎత్తిపోతల జలపాతం. రోజూ వందలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ జలపాత దృశ్యం నల్గొండజిల్లాలోని నాగార్జున సాగర్‌కు దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో వుంది.

హెచ్. ఆర్. బాబు

సాగర్ చుట్టుప్రక్కల గల దట్టమైన అడవుల్లో ఉన్న ఈ జలపాతం టైగర్ రిజర్వ్ 3568 చ.కి.మీటర్ల విస్తీర్ణం నడమ వుంది. పులులతో బాటు చిరుతపులులు, ఎలుగుబంట్లు, లేళ్లు మొదలైన వన్యప్రాణులకు ఇది ఆవాసంగా వుంది.

పల్నాటి కొండల్లో పుట్టి పల్నాటి సీమ ప్రాంతంలోనే కృష్ణానదిలోనే సంగమించే చంద్రవంకనదికి మాచెర్ల చెన్నకేశవస్వామిని అభిషేకిస్తూ నెలవంక ఆకారంలో వంపులు తిరిగి దాదాపు రెండుకిలోమీటర్లు రమణీయమైన లోయగుండా ప్రవహిస్తూ కృష్ణవేణిలో సంగమిస్తోంది. ఈ చంద్రవంక ప్రకృతిగీసిన ఈ రమణీయ సజీవ చిత్రం పర్యాటకులకు ఆహ్లాదకరమైనది. సినిమా షూటింగ్‌లకు అనువైనది. జనావాసాలకు దూరంగా ఉన్న ఎత్తిపోతల జలపాతం వాతావరణ కాలుష్య బారినపడకుండా తన సొగసైన సోయగాలతో చూపరులను మంత్ర ముగ్ధులను చేస్తోంది.

జాతీయ పర్యాటక కేంద్రంగా ఈ జలపాతాన్ని గుర్తించిన చాలాకాలం తరువాత అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఎకో - టూరిజం ప్రాజెక్ట్ కింద కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు 75 లక్షలరూపాయల నిధులతో అభివృద్ధి పరిచారు. ఈ నిధులతో ఎత్తిపోతల జలపాతంపైకి రంగురంగుల కాంతి ప్రసరించి ప్రకాశవంతం చేశారు. ఇప్పటికే ఇక్కడ 68 లక్షల వ్యయంతో ఒక రెస్టారెంట్, మూడు కాటేజీలు, సావనీర్‌షాప్, సరిహద్దుగోడ, జనరేటర్ ల్యాండ్‌స్కేప్ వంటి వసతులు కల్పించారు. పర్యాటకుల సౌకర్యార్థం కాటేజీలను కూడా ఏర్పాటు చేశారు. ఈ జలపాతంలో లైట్లు అమర్చి దీనికి సరికొత్త శోభను కలుగచేశారు. ఇందుకుగాను విదేశాల నుండి దిగుమతి చేసుకున్న పరికరాలను వినియోగించారు. మల్టీ కలర్ లైట్లకు టైమర్‌ను జోడించి ప్రధాన జలపాతానికి అమర్చారు. రాత్రి వేళ రంగులతో ధగధగ మెరిసే జలపాత దృశ్యం నయన మనోహరమేగానీ వర్ణించనలవి కాదు. జలపాత నీటి మడుగులో 1976 నుండి అటవీశాఖ మొసళ్లను పెంచుతున్నది. ఇప్పుడు సుమారు 200 మొసళ్లు ఉన్నాయిక్కడ.

ఈ ఎత్తిపోతల ప్రాంతానికి ఆధ్యాత్మికమైన ప్రాధాన్యత కూడా ఉంది. ఇది రామాయణకాలంలో శబరి ఆశ్రమ ప్రాంతమని జానపదుల విశ్వాసం. యతుల తలపోతలు (మునుల తపస్సులు) చేసిన ప్రాంతం గనుక ఈ ప్రాంతం క్రమేణా 'ఎత్తిపోతల'గా వ్యవహారంలోకి వచ్చింది. జలపాత లోయ తీరాన ఉన్న కొండ దిగువన రంగనాయకస్వామి, మధుమతిల ఆలయాలు నేటికి కనిపిస్తాయి. ఇక్కడి ఓ కొండగుహలో త్రిముఖుడైన దత్తాత్రేయుని గుడివుంది. అత్రిముని భార్య అనసూయ పాతివ్రత్యాన్ని పరీక్షించేందుకు త్రిమూర్తులు భువిగా రాగా వారిని పసివారిగా మార్చిన ఘటన ఇక్కడే జరిగిందని అనసూయకు 'దత్త' పుత్రులుగా వున్న వీరు ముప్వూరూ కలసి దత్తాత్రేయునిగా దర్శనమిచ్చి వెలిశారనేది పురాణగాథ.

నల్లమల అడవుల గుండా పారుతూ చంద్రవంక సూర్యభాగ, భాగీరథీనదులు ఒక్కటై 70 అడుగుల ఎత్తునుండి లోయలోకి జలపాతంగా జారుతున్న దృశ్యం ఒక జలపాత గీతంను వినిపిస్తుంది. ఎత్తిపోతల వద్దకు నాగార్జునసాగర్, హైదరాబాదు, గుంటూరు నుండి రోడ్డు మార్గంలో ప్రయాణం చేయవచ్చు. నాగార్జునసాగర్, మాచెర్లలను అనుసంధానం చేసే రోడ్డు నుండి ప్రక్కకు మళ్లితే జలపాత ప్రాంతాన్ని చేరుకోవచ్చు. ఈ దారి ఏకంగా ఒక కొండ చివరికి చేర్చుతుంది. అక్కడ లోయలోకి పండుతున్న ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించవచ్చు. ఈజిప్టులోని నైలూ నదీ జలపాతం సౌందర్యాన్ని గొప్పగా చెప్పుకునే మనం ఈ ఎత్తిపోతల జలపాతాన్ని చూస్తే దాన్ని చూడలేకపోయినా చూసినంతగా అనుభూతి కలుగుతుంది.

అలరించి.. ఆలోచింపజేసిన బోడేపూడి స్మారక రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు


సద్గతి నాటికలో ఒక దృశ్యం

పుప్పాల మట్టయ్య

కళకళకోసం కాదు ప్రజల కోసమని నూరుపాళ్లు నమ్మి, తన మధురమైన మాట, పాటతో నాటి వ్యవస్థపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన యోధుడు బోడేపూడి వెంకటేశ్వరరావు. ప్రజానాయకునిగా, కార్యదీక్షాపరునిగా, అంతిమ శ్వాస వరకూ పోరుదారిన సాగిన ధీరుడు. ఆ మహామనిషికి నివాళులు అర్పిస్తూ బోడేపూడి స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 6నుండి 8వతేదీవరకు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించారు.

ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుండి 10 నాటికలను ఆహ్వానించారు. 6వ తేదీన పరిషత్ అధ్యక్షులు టి.ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభ అనంతరం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి ఈ నాటకోత్సవాలను ప్రారంభించారు. పోటీల్లో మొదటి ప్రదర్శనగా నెమిలికంటి రమణ రచించగా, రమేష్‌బాబు దర్శకత్వం వహించిన స్వర్ణభారతి కల్చరల్ ఆర్ట్స్ గుంటూరు వారి **ఆశల 'వల్లే'కి** నాటిక ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అద్దంపట్టింది. ఆధునిక జీవన స్రవంతిలో అంతరించి పోతున్న మానవ సంబంధాలు, పట్టణంలోని దగా కళ్లకు కట్టింది. భూమిపుత్రులు నేలతల్లిని విస్మరించి పట్టణాలకు వలన వెళ్లి దగావడిన ఇతివృత్తాన్ని తీసుకున్నారు. దీనికోసం గుడిసె, వేపచెట్టు, చేదబావి, కుక్కిమంచం సెట్ గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించాయి. తన మనవడికి అరక దున్నడం నేర్పించే సన్నివేశం ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించింది. మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్ వారి కీ.శే. బి.రామకృష్ణ రచించి, టి. శివరామకృష్ణ దర్శకత్వం వహించిన **'అమెరికా అల్లుడు'** ఆద్యంతం నవ్వుల జల్లులు కురిపించింది. భార్యపోరు పడలేక ఆఫీస్‌లో లంచం (రూ.500) తీసుకున్న భర్త, తీసుకున్నది దొంగనోటు కావడం, దాన్ని వదిలించుకోవడానికి అతను పడినపాట్లు నవ్వుల పంట పండించింది. ఆశకు పోతే దురాశ ఎదురవుతుందనే నీతిని ప్రధానంగా ఇందులో చూపించారు. విజయసారధి విజన్స్ ఖమ్మం వారి బి.వి.రామారావు రచించి, కూతురు జగదీశ్వరావు దర్శకత్వం వహించిన **'వడిచస్తారు జాగ్రత్త'** నాటికలో రైతు ఎవరినీ మోసగించడు, రైతునే అందరూ మోసం చేస్తారు, రైతులు మోసపోవద్దని తెలియజెప్పే ఇతివృత్తంతో సాగింది. రెండవ రోజు ఐదు నాటికలను ప్రదర్శించారు. వాటిలో మొదటిది శ్రీసత్యకల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి గోళ్లపాటి నాగేశ్వరరావు రచన, దర్శకత్వం వహించిన **"పుట్టలో ఏలెడితే కుట్టనా?"**. ఈ నాటికలో ప్రధానంగా నేటి విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపింది. విద్యార్థులకు చిన్ననాటినుండే దేశభక్తి భావాలు అలవర్చాలనేది కూడా ఈ నాటికలో ముఖ్యాంశం. సాంకేతిక పరిజ్ఞానం మానవ మేధస్సును మొద్దుబార్చే విధానాన్ని ఈ నాటిక ద్వారా బహిర్గతం చేశారు. బాల కార్మికుడిగా బాలిక నటన ఆద్యంతం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. రెండవ నాటికగా ది యంగ్మెన్స్ హేపీక్లబ్, కాకినాడ వారి ఆకెళ్ల రచనకు వై.ఎస్.ఎన్.మూర్తి దర్శకత్వం వహించిన **"పెద్దలకు మాత్రమే"** ప్రదర్శించారు. పిల్లలను తల్లిదండ్రులు సక్రమమైన మార్గంలో పెంచకపోతే ఎలా తయారవుతారో, తల్లిదండ్రులు అనుసరించాల్సిన జాగ్రత్తలను ఈ నాటిక ఇతివృత్తంగా అందించారు. తల్లిదండ్రులు నిజాయితీగా మెలగకపోతే పిల్లలు కూడా అడ్డదారులు తొక్కుతారనేది ఈ నాటిక నీతి. మూడవనాటికగా కళాలహిరి విశాఖపట్నం వారి **"అనగనగా ఒక రాజు"**ను ప్రదర్శించారు. ఈ నాటికను గాడి వీరభద్రరావు రచించగా, కీ.శే. కె.మందులు దర్శకత్వం వహించారు. దేశంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని ఈ నాటిక ద్వారా తెలిపారు. ప్రజలను పాలించే రాజే అసమర్ధుడైతే ఎలాంటి దుష్ఫలితాలు వస్తాయి అనే ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. ఈ నాటికలో వాడిన కాస్ట్యూమ్స్, సంగీతం, అలంకరణ అన్నీ ఆకట్టుకునేలా కళాకారులు

ప్రదర్శించారు. నాలుగవ ప్రదర్శనగా కళానిలయ, గుంటూరు వారి **"ఇచ్చుటలో ఉన్నహాయి"**నాటికను ప్రదర్శించారు. ఎస్.కె. హుస్సేన్ రచించగా కరుణం సురేష్ దర్శకత్వం వహించారు. అహంకారం అనేది మనిషిని ఎలా నాశనం చేస్తుందో ఈ నాటిక ఇతివృత్తం. రెండవరోజు చివరగా పోలీస్ జనజాగృతి కళాబృందం,ఖమ్మంవారి **"వేలుకొలువు"**ను ప్రదర్శించారు. జయరాజు రచించిన దీనికి జి.దస్తగిర్ దర్శకత్వం వహించారు. పెరిగిన అప్పులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చేలా ఉందీ నాటిక. ఖమ్మంపోలీస్ కళాకారులు ప్రదర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామాల్లో ప్రదర్శిస్తే కొంత ప్రయోజనం చేకూరే విధంగా ఉంది. చివరి రోజున కళాప్రియ, రాజమండ్రివారి **"ఆల్బం"** నాటికను ప్రదర్శించారు. భారతుల రామకృష్ణ రచించి దర్శకత్వం వహించారు. పిల్లల ఎదుగుదలతో వచ్చే మార్పులు, యవ్వనదశలో పిల్లల మనస్తత్వాలలో వచ్చే మార్పులను గమనించి తల్లిదండ్రులు వారికి తగు సూచనలిచ్చి వారిని సన్మార్గంలో పెట్టడం అనే ఇతివృత్తంతో ఇది కొనసాగింది. నేటి స్పీడు యుగంలో కోరికలతో కొట్టుమిట్టాడుతున్న యువత వాటిని నియంత్రించుకోవాలనే నీతిని చెప్పారు. పోటీల్లో ఆఖరి ప్రదర్శనగా కళావాహిని, ఉభయగోదావరి వారి **"సద్గతి"** ని ప్రదర్శించారు. దీన్ని స్నిగ్ధ రచించగా యం. ప్రసాదమూర్తి దర్శకత్వం వహించారు. మనిషికి ధనం కంటే ప్రేమాభిమానాలే ముఖ్యమనే ఇతివృత్తాన్ని తెలియజేసింది. డబ్బే సర్వస్వమై ఆప్యాయతలు కనుమరుగవుతున్న నేటి సమాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిచింది. మూడు రోజులపాటు జరిగిన ఈ నాటికల ముగింపు కార్యక్రమం కళావరిషత్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.హరీష్ అధ్యక్షతన జరిగింది. ఉత్తమ ప్రదర్శనగా **ఆశలపల్లెకి** ఎంపికైంది. దీనికి పదివేల రూపాయల నగదు బహుమతితోపాటు, జ్ఞాపికను రాజ్యసభ సభ్యులు పి.మధు చేతుల మీదుగా అందజేశారు, ద్వితీయ బహుమతికి **సద్గతి** ఎంపికైంది. దీనికి ఎనిమిది వేలరూపాయల నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఉత్తమ దర్శకుడుగా రమేష్ (ఆశల పల్లెకి), ఉత్తమ రచయితగా గోళ్లపాటి నాగేశ్వరావు (పుట్టలో ఏలెడితే కుట్టనా?), ఉత్తమ నటులుగా విజయలక్ష్మి (అనగనగా ఒక రాజు), ప్రసాదమూర్తి (సద్గతి), వెంకటరమణ (ఆశలపల్లెకి), భాస్కర్ (అమెరికా అల్లుడు), రామకృష్ణ (ఆల్బం), ఎస్.కె. హుస్సేన్ (ఇచ్చుటలో ఉన్న హాయి), చిరంజీవి (పెద్దలకు మాత్రమే) ఎన్నికయ్యారు.

ఓవైపు సినిమాలు, టీవీల ప్రభావం అమితంగా ఉన్నా ప్రతిరోజూ ఆడిటోరియం కిక్కిరిసిపోవడం విశేషం. పోటీల్లో పాల్గొన్న ప్రతి నాటిక ఏదో ఒక సామాజిక సందేశాన్ని అందించాయి. రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రాంతాలనుండి వచ్చిన కళాకారులకు నిర్వాహకులు చక్కని వసతి ఏర్పాట్లు కల్పించారు. మొత్తంగా మూడురోజులపాటు జరిగిన ఈ నాటికలు ఖమ్మం ప్రజలకు మధురానుభూతిని మిగిల్చాయి.

ఎం. పి. మధు, ఎమ్మెల్యే తమ్మినేని వీరభద్రం చేతులమీదుగా ఉత్తమ దర్శకుని అవార్డును అందుకుంటున్న రమేష్.

రోగంతో వద్దు చెలగాటం !

శవంపై డబ్బులేరుకోవటం
శవరాజకీయాలు చేయటం... అంతా పాత
చింతకాయపచ్చడి
కంప్యూటర్‌యుగంలో... సెల్‌ఫోన్ల
యంత్రాంగంలో
టెలీమెడిసిన్ వీధుల్లో... అవయవాల మార్పిడి
ఊపందుకున్న తరుణంలో
మిడిమేలపుటాలోచనలు...
బుడిబుడి నడకల, వడివడి గుండెలనెన్నో
జడిజడిగా జబ్బునయంచేసే జనాధీన డాక్టర్లున్న
హాస్పటల్‌కి కాక
సదస్సంటూ... పాలకుడిపై
కస్సుబుస్సులంటూ...
సంకటాల పాల్జేయటం మతితప్పినచర్య
గత పాలకుడి కాలాన గుర్తుకురాని
బాలహృద్రోగుల సపర్య
గుండెజబ్బుల నయంకంటే గుర్తింపు ఆరాటపు
నాయకుని (అ)రాచకార్యం
ఎవ్వరూ చేయకూడని అనాలోచిత
ఘాతుకచర్య
వద్దు వద్దు మనిషీ...
దేనితోనైనా ఆడుకో... నీ స్వార్థం నీ
ఇష్టమొచ్చినంత చూసుకో!
కానీ...
రోగంతో వద్దు చెలగాటం!
ఎందుకంటే అది చేస్తుంది మృత్యువుతో
సయ్యాటలు!!

-డా॥నాగినేని భాస్కరరావు

(7-8-04న హైదరాబాదులో గుండెజబ్బుల పిల్లల సదస్సు ప్రారంభంలో మరణించిన శోభన్ (14సం॥)కు స్మృత్యంజలితో)

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పొరుగింటి కొబ్బరిచెట్టు...?

మా ఇంటి ప్రహరీగోడకు ఒకగజం దూరంలో మా పొరుగువారు రెంధు కొబ్బరిమొక్కలు పెంచారు. కొబ్బరివేళ్ళకు మా గోడ పగుళ్ళు ఇచ్చింది. వాటి ఆకులు మా పెరడులోనికి వచ్చినై. కొబ్బరిమొక్కలను తొలగించడానికి ఏం చేయమంటారో చెప్పండి.

వి సుజాత, పాలకోడేరు, కృష్ణాజిల్లా

- మీ ఇంటి ప్రహరీగోడ పగుళ్ళు ఆ కొబ్బరిచెట్టు వల్ల వచ్చినవి అని మీ పక్కింటి ఆయనకు నోటీస్ ఇచ్చి "ఈజీమెంట్ ఆక్టు" ద్వారా మీరు మీ దగ్గరలోని న్యాయస్థానంలో దావా వేయాల్సి ఉంటుంది. దీనికి జరిగిన నష్టపరిహారాన్ని కూడ మీరు కోరవచ్చు.

వడ్డీవ్యాపారానికి లైసెన్సుండాలి

కొంతమంది ఇతరులకు అప్పుఇచ్చి ప్రామిసరీ నోటులు రాయించుకుంటున్నారు. లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేయవచ్చునా? అట్టివారు చట్టపరంగా బాకీదారునిపై చర్యలు తీసుకొనవీలున్నదా? ఎన్ని వేలు వరకు ప్రామిసరీ నోటుపై రాయవచ్చు? ఎన్ని వేలుకు రూ. 1/- రెవిన్యూ స్టాంపు సరిపోతుంది? ప్రింటెడ్‌నోటు చెల్లుతుందా? నిరక్షరాస్యుడైతే నిశానీ వేయించవచ్చా?

జి ఎస్ ప్రసాదరావు, రి.టీచర్, పాలకొల్లు

ఏ లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేయడం చట్టపరంగా తప్పు. ఇది సర్వసాధారణమయ్యింది. అట్టి వారిపై రుజువులతో నిరూపించగలిగితే చట్టపరంగా చర్య తీసుకొని కేసు పెట్టవచ్చును. ప్రామిసరి నోటుపై ఎన్నివేల వరకైనా వ్రాసుకొవచ్చును. దానికి ఇంత మొత్తం వరకే వ్రాయాలని లేదు. సుప్రీంకోర్టు ఈ మధ్యకాలంలో తెల్ల పేపరుపై డబ్బుముట్టినట్టు వ్రాసిచ్చినదానిని రశీదుగా పరిగణిస్తూ తీర్పు నిచ్చింది.

న్యాయవాదిపై అపవాదు వేయకండి

నేను గుడివాడ ఆర్‌డివో గార్కి నా డాబా సర్వే కొరకు 16-12-1999న రూ.200/- ఎస్‌బిఐ లో చెల్లించినాను. నేను రాసి ఇచ్చిన పిటీషను, బ్యాంకు రశీదు, నా దఖలు దస్తావేజు(ఫొటోస్టాట్)లను ఆర్డీవోగారికి కొరియర్‌ద్వారా పంపాను. నాకు ఆపోజిట్‌పార్టీవారు(డాక్యుమెంటు రైటర్లు వారి భార్యలు) మా వదినగారు వారి కుమార్లు, కూతుర్లు వగైరాలు లంచాలుపెట్టి సర్వేకు రాకుండా చేశారు. నేను గుడివాడ మునసబుకోర్టులో ఇంజక్షన్ దావా వేసినాను. సూట్ నెం.583/99 తేదీ22-12-1999న ఆర్డరు ఇచ్చినారు. ఆ ఆర్డరుని కూడా ఖాతరుచేయకుండా నా గోడను బలవంతముగా పగులకొట్టినారు. 8 ట్రాక్టర్ల ఇటుకలు, దర్వాజా, పెద్దకిటికీ దొంగతనముగా ఎత్తికెళ్ళినారు. మా లాయరుగారు కంటెంట్ ఆఫ్ కోర్టు పెట్టాను అన్నారు. కాపీ ఇవ్వమన్నాను. ఇవ్వలేదు. తరువాత వేరే లాయరుగారిని పెట్టాను. ఆయన 19-9-2001న లంచం తీసుకుని పిటీషను డిస్మిస్ చేయించారు. మరో లాయరును సంప్రదిస్తే ఆయన దగ్గరుండే వేరే ప్లీడరు ఆవతలపార్టీవారి దగ్గర డబ్బులు తీసుకుని ముఖ్యమైన కాగితాలు ఇచ్చినారు. మరో లాయరుగారి వద్దకు వెళ్ళాను. ఆయన మాండిటరీ మార్చినారు. అది మునసబుగారు ఎ2828/02 నెంబరు వేశారు. వాయిదాలు పడుచున్నది. మునిసిపల్ కమీషనరుకి, గుడివాడ 2వ టౌన్ ఎఎస్‌పికి, ఎంఆర్‌వోకి, జిల్లా ఎస్‌పికి, జిల్లా సర్వేయర్‌కి, కలెక్టర్‌కి, ప్రభుత్వకార్యదర్శి, హైదరాబాద్ ప్లానింగ్ కమీషనరు (డైరక్టర్)కి పిటీషన్లు పెట్టుకున్నాను. నా డాబా శిధిలావస్థకి చేరుకుంది. ఈ కేసు ఏమౌతుందోనని ఆందోళనగా ఉంది. నాకు తగు సలహా ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

కె వజ్రాలు, గుడివాడ, కృష్ణాజిల్లా.

మీరు ఈపాటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కావున మీ న్యాయవాది గారిని సంప్రదిస్తే సరిపోతుంది. కోర్టులో తప్పు జరిగిందని రుజువు చేయలేకపోయినందున మీ కేసు కొట్టి వేసినట్టున్నారు. ఎంత అనుభవజ్ఞుడయినా, మీరు ఇచ్చే పత్రాలపై సాక్ష్యాలను మాత్రమే చూపించి మీ వాదన న్యాయమూర్తిగారికి వినిపిస్తారు. కాని ఓడిపోయిందని న్యాయవాది ఎదుట పక్షం వాడికి వశమయిపోయాడని మీరు అపనమ్మకంలో ఉండి అపవాదు వేయకండి. న్యాయవాదిని నియమించుకునేటప్పుడే ఆలోచించి నియమించుకోవాలి. నియమించుకొన్నాక అతన్నే నమ్ముకోండి. మీ అపనమ్మకాన్ని ఆతడిపై రుద్దకండి.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

హ్యాపీ బర్త్‌డే

(29-8-2004 నుంచి
4-9-2004 వరకు)

సౌజన్య
1సం॥, 3.9.2003
అరుణ-సింగయ్య
బోధన్-నిజామాబాద్

విద్దే హేమశ్రీలత
2సం॥, 4.9.2002
వెంకట రజని-వెంకటసూర్య ప్రకాష్‌రావు
మచిలీపట్నం-కృష్ణా

ఎస్. సుధ కుమారి
7సం॥, 4.9.1997
శ్రీదేవి-వెంకట్రావు
ఒంగోలు-ప్రకాశం

సాయి ప్రియ
5సం॥,ఆగస్టు-1999
సుహాసిని-ఉమ్రావ్ సింగ్‌ఠాకూర్
తాండూర్-ఆదిలాబాద్

డి. తేజస్వి
4సం॥,ఆగస్టు-2000
సైదమ్మ-వీరయ్య
ఓగోడు-నల్లగొండ

సందీప్
8సం॥, ఆగస్టు-1996
నాగమణి-సత్యనారాణయ
ఉక్కునగరం-విశాఖ

కె. వంశీకృష్ణ
రమాదేవి-వెంకటేశ్వర్లు
ఇల్లందు-ఖమ్మం

జి.సమీర
2సం॥, ఆగస్టు-2002
సుజాత-నరసింహారావు
విజయవాడ-కృష్ణా

జుబెర్
9సం॥, ఆగస్టు-1995
నూర్జహా-ఉమర్
అశోక్‌నగర్-గోదావరిఖని

రాజేష్‌కుమార్(బబ్లూ)
8సం॥, ఆగస్టు-1996
గౌరి-రవి
గజపతినగరం-విజయనగరం

కె. ప్రశాంత్
1సం॥, ఆగస్టు-2003
గౌరి-బుజ్జి
ఎ.వెంకంపేట-విజయనగరం

అంటుపర్తి సంధ్య
6సం॥, ఆగస్టు-1998
నిర్మల-చంద్రయ్య
పురిటిపెంట-విజయనగరం

నందాల శివ
4సం॥, ఆగస్టు-2000
మణెమ్మ-యాదయ్య
అరెగూడెం-నల్లగొండ

గమనిక: పదేళ్ళ వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, సంవత్సరం, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4 ,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా ఒక పోస్ట్ కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.

మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : పోట్ల సాయి
వయసు : 4 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు : టీవీ చూడటం, క్రికెట్ ఆడటం.

చిరునామా: పి.సాయి, సన్నాఫ్ శ్రీహరి, దామేగుంట, కొడవలూరు (మం), నెల్లూరు జిల్లా.

పేరు : దిగమర్తి వనిత (చిన్ని),
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పాటలు పాడటం, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదవటం

చిరునామా: డి.వనిత, డాటరాఫ్ రాజుబాబు, పి.టి.పాలెం, విశాఖపట్నం.

పేరు : వాస మౌనిక
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు : టీవీ చూడటం, ఆటలు ఆడటం, పాటలు పాడటం, డ్రాయింగ్ వేయటం.
లక్ష్యం: లాయర్ కావటం.

చిరునామా: **వి.మౌనిక**, డాటరాఫ్ హైమా వెంకట్, హెచ్ నం: 1-7-184, ఆర్.బి.నగర్, భువనగిరి. నల్గొండ జిల్లా. **పిన్:** 508 116.

పేరు : ఎం.దామోదర్ (దాము)
వయసు : 17 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : డైరీ రాయటం, వాలీబాల్, చెస్ ఆడటం, ప్రజాశక్తి చదవటం.

చిరునామా: **ఎం.దామోదర్**, 10వ తరగతి, గురుకుల పాఠశాల, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

పేరు : పి.శేఖర్
వయసు : 18 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : కథలు రాయటం, చదవటం, ప్రజాశక్తి చదవటం.
లక్ష్యం: డైరెక్టర్ కావటం.

చిరునామా: **పి.శేఖర్**, కేరాఫ్ మదర్‌థెరిస్సా క్లినిక్, ఆమనగల్ (గ్రా & మం), మహబూబ్‌నగర్ జిల్లా. **పిన్:** 509 321.

పేరు : వాస చంద్రిక (చందు)
వయసు : 4 సం॥
చదువు : యు.కె.జి
హాబీలు : టీవీ చూడటం, ఆటలు ఆడటం. చిన్న పాపలతో ఆడుకోవటం.
లక్ష్యం: డాక్టర్ కావటం

చిరునామా: **వి.చంద్రిక**, డాటరాఫ్ హైమా వెంకట్, హెచ్ నం.1-7-184, ఆర్.బి.నగర్, భువనగిరి, నల్గొండ జిల్లా. **పిన్:** 508 116.

పేరు : ఆర్.రిచిత్‌రాజ్
వయసు : 13వ సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : చదువు, క్రికెట్ ఆడటం, డ్రాయింగ్ వేయటం, చిన్నారి చదవటం.

చిరునామా: **ఆర్.రిచిత్‌రాజ్**, డోర్ నం.14-4-507, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, విఠల్‌నగర్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.

పేరు : సింగాడె రాకేష్
వయసు : 3 సం॥
చదువు : ఎల్‌కెజి
హాబీలు : ప్రజాశక్తి చదువుతుంటే వినటం, టీవీ చూడటం
లక్ష్యం: హీరో కావటం

చిరునామా: **సి.రాకేష్**, సన్నాఫ్ విఠల్ & శారద, హెచ్ నం.26/317, కొడల్ పేట, ఆదోని, కర్నూలు జిల్లా.